విశాలాంధ్ర గుంటూరు జిల్లా

అనాథలకు ఉచితంగా మందుల పంపిణీ

విశాలాంధ్ర-రాజుపాలెం: గుంటూరు ప్రముఖ హోమియో వైద్యుడు రాఘవ రావు ఆధ్వర్యంలో రాజుపాలెం మండలం కొండమూడు పరిధిలోని వీరమ్మ కాలనీలో డెవలప్‌మెంట్ సొసైటీ నిర్వహిస్తున్న బాలుర వసతి గృహంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఆయనతో పాటు ఆశ్రమ నిర్వాహకులు గరిక పాటి శంకర్రావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా అందజేత

విశాలాంధ్ర-రాజుపాలెం: మండలంలోని అంచులవారి పాలెం గ్రామంలో అంచుల సాయి కొన్ని రోజుల క్రితం మరణించడం జరిగినది. అందుకు సంబంధించి ప్రభుత్వం తరపున రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు సహాయ సహకారాలతో లక్ష రూపాయల వైఎస్సార్ బీమా మంజూరు చేశారు. ఈ డబ్బును సాయి భార్యకి సర్పంచ్ అంచుల రామాంజనేయులు అందజేశారు. వైస్ ఎంపీపీ హరి సూరమ్మ, నాగేశ్వరరావు, గ్రామ సచివాలయ కన్వీనర్ వేపూరి సోమశంకర్ రావు, అంచుల పుల్లయ్య, సెక్రటరీ ముక్తార్, వెల్ఫేర్ అసిస్టెంట్ నవ్య, ఇంజనీరింగ్ అసిస్టెంట్ రాంబాబు, వలంటీర్ నాగరాజు పాల్గొన్నారు.

మహిళా రెజ్లర్‌ల ఉద్యమానికి మద్దతివ్వాలి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం: మహిళా మల్లయోధుల ఉద్యమానికి దేశ ప్రజలందరూ మద్దతివ్వాలని ప్రముఖ రచయిత్రి పోగుల విజయశ్రీ కోరారు. పతకాలు సాధించి జాతీయంగానూ, అంతర్జాతీయంగానూ భారత కీర్తి పతాకం ఎగురవేసిన మహిళా మల్లయోధులు వీధులకెక్కి నిరసన తెలియజేయాల్సిన పరిస్థితి రావటం విచారకరమని ఆవేదన వ్యక్తంచేశారు. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద 15రోజులుగా ఆందోళన చేస్తున్న మహిళా మల్లయోధుల ఉద్యమానికి మద్దతుగా స్థానిక అవగాహన సంస్థ కార్యాలయంలో 'మహిళా సభ్యులు ఒక ప్రత్యేక సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయశ్రీ మాట్లాడుతూ ఒలింపిక్స్ కామన్వెల్త్ గేమ్స్ పతకాలు సాధించి భారతదేశ కీర్తి పతాకాన్ని ప్రపంచ వ్యాప్తంగా చాటిన మహిళా మల్లయోధులుపై ఒక ఎంపీ లైంగిక వేధింపులకు పాల్పడటం అవమానకరమన్నారు. తమకు న్యాయం చేయాలని ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద కొన్ని రోజులుగా నిరసన తెలుపుతున్న రెజ్లర్లకు దేశం మొత్తం సంఘీభావం తెలుపుతున్నట్లు చెప్పారు. రచయిత్రి ఎవికె సుజాత, పింగళి భాగ్యలక్ష్మి, కమలకుమారి, లావణ్య, విజయభారతి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమం

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం: ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికుల, పెన్షనర్ల సమస్యలు పరిష్కరించని ఎడల ఈ నెల 22వ తేదీ నుంచి ఆందోళన కార్యక్రమాలకు సిద్ధమవుతున్నట్లు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఏపీ జీఈఏ)గుంటూరు జిల్లా అధ్యక్షులు సయ్యద్ చాంద్‌బాషా హెచ్చరించారు. ఈ మేరకు గురువారం స్థానిక సాయిబాబా ఆలయం నందు తాడికొండ తాలూకా యూనిట్ కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా చాంద్‌బాషా మాట్లాడుతూ ఉద్యోగుల జీతభత్యాలు, పెన్షనర్ల పెన్షన్స్ ప్రతి నెల 1వ తేదీన చెల్లించే విధంగా చట్టం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చట్టబద్ధత లేని సీపీఎస్‌ను రద్దు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పాదయాత్రలో వైఎస్ జగన్ ఇచ్చిన హామీ మేరకు కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షులు మురళీ, తాలూకా యూనిట్ అధ్యక్షులు సుబ్బారావు, కార్యదర్శి సుమిత్ర, నగరశాఖ అధ్యక్షులు వై.నాగేశ్వరావు, నగరశాఖ ఉపాధ్యక్షులు పెద రత్తయ్య పాల్గొన్నారు.

'ఉచిత మోడల్ లా-సెట్' పోస్టర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం: ఏపీ బీసీ అడ్వకేట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 14న నిర్వహించే 'ఉచిత మోడల్ లా-సెట్' పోస్టర్‌ను నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు గురువారం వారి నివాసంలో ఆవిష్కరించారు. అనంతరం ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు మాట్లాడుతూ లా-సెట్ రాయబోయే అభ్యర్థులకు ఏపీ బీసీ అడ్వకేట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ మోడల్ పరిక్ష ఎంతో ఉపయోగపడుతుందన్నారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు పల్లపు కృష్ణ మాట్లాడుతూ కుల, మతాలకు అతీతంగా లా-సెట్ రాయబోయే అభ్యర్థులందరూ ఈ మోడల్ పరీక్షను రాయాలని పేర్కొన్నారు. గుంటూరులో పరీక్షా కేంద్రం లక్ష్మీపురంలోని మాంటిస్సోరి ఇంగ్లీష్ మీడియం స్కూల్ నందు ఉదయం 10 గంటల నుంచి 11.30 గంటల వరకు నిర్వహించటం జరుగుతోందన్నారు. వివరాలకు 9848447407కు సంప్రదించాలని పల్లపు కృష్ణ వెల్లడించారు.

14న సరిగమప ఛాంపియన్‌షిప్ గ్రాండ్ ఫినాలే

విశాలాంధ్ర-గుంటూరు: సంగీత ప్రయాణంలో 14వ సీజన్ ప్రారంభమైన సరిగమప ఛాంపియన్ షిప్ తుదిపోరుకు సిద్ధమైంది. ఈ నెల 14న ప్రసారం కానున్న సరిగమప ఛాంపియన్ షిప్ గ్రాండ్ ఫినాలేలో విజేతలెవరో తేలిపోనుంది. సాయంత్రం 6 గంటలకు ఛాంపియన్స్ మధ్య జరుగుతున్న ఈ పోరులో టైటిల్ విన్నర్ ఎవరో తెలిసిపోనుంది. ఎనర్జిటిక్ యాంకర్ ప్రదీప్ పంచ్‌లు, ముగ్గురు జడ్జిల కామెంట్స్‌తో ఈ ఫినాలే ఎపిసోడ్ వినోదం పంచనుంది. ఈ గ్రాండ్ ఫినాలే ఎపిసోడ్లో విజేత ఎవరో ప్రకటించేందుకు ప్రముఖ సంగీత దర్శకుడు, మెలొడీ బ్రహ్మ మణిశర్మ ముఖ్యఅతిథిగా విచ్చేయనున్నారు.

ఘనంగా మల్లేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

విశాలాంధ్ర-గుంటూరు క్రైమ్: స్థానిక ఆర్.అగ్రహారంలో వేంచేసి ఉన్న శ్రీ గంగాభ్రమరాంబ మల్లేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాల సందర్భంగా దేవస్థానంలో 1500 మందికి అన్నసమారాధన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. సాయంత్రం స్వామి వారి సామ్రాజ్య పట్టాభిషేకం, మహావైశాఖ పూజ, పవళింపు సేవ, మంత్రపుష్పము అనంతరం భక్తులకు తీర్థప్రసాద వినియోగం గావించారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన వ్యవస్థాపక ధర్మకర్త, ఛైర్మన్ పన్నాల వెంకట బుచ్చి రామశాస్త్రి, కార్పొరేటర్ నిర్మల వెంకటరమణ, దేవస్థాన కార్యనిర్వహణాధికారి పగడాల శివ కోటేశ్వరరావు, ధర్మకర్తల మండలి సభ్యులు ముత్తు రాజు, కోడూరి శ్రీవల్లి, పరికళ్ల శివకుమారి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత జగన్‌దే

విశాలాంధ్ర-పిడుగురాళ్ల: చరిత్రలో ఏ రాష్ట్రంలో అమలు చేయనటువంటి గొప్ప సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డికి దక్కుతుందని ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి చేపట్టిన సంక్షేమ అభివృద్ధి పథకాలతో ధైర్యంగా ప్రజల్లోకి వెళ్తున్నామని తెలిపారు. పిడుగురాళ్లలోని ఎస్సీ కాలనీలో గురువారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేటి సీఎం కార్యాలయ ముట్టడిని జయప్రదం చేయండి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జంగాల అజయ్‌కుమార్

విశాలాంధ్ర-గుంటూరు: రైతు పట్ల రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ ఈ నెల 12వ తేదిన ఉదయం 10 గంటలకు సీపీఐ, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో తలపెట్టిన సీఎం కార్యాలయ ముట్టడి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. మంగళగిరిలోని సీపీఐ కార్యాలయం నుంచి ప్రదర్శనగా తాడేపల్లిలోని సీఎం కార్యాలయానికి చేరుకుని ముట్టడిస్తామని వెల్లడించారు. గుంటూరు మల్లయ్యలింగంభవన్‌లోని వీఎస్‌కే హాలులో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు కొల్లి రంగారెడ్డి మాట్లాడుతూ ఇటీవల కురిసిన అకాల వర్షం కారణంగా వరి, మొక్కజొన్న, జొన్న, మిర్చి తదితర పంటలు నీటిపాలై రైతు కన్నీరు పెడుతున్న తీరు హృదయాన్ని ద్రవించివేస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బటన్‌లు నొక్కడం తప్పా నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకునే చర్యలు తీసుకోకపోవడం విచారకరమన్నారు. కల్లాల్లో మొక్కజొన్న మొలకెత్తుతుందని, లక్షలాది రూపాయల పెట్టుబడి ఆవిరైపోతుంటే రాష్ట్ర ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేదని విమర్శించారు. రైతే రాజు అని... రైతు దేశానికి వెన్నుముక అంటూ... రైతును అన్ని విధాల ఆదుకుంటామని... పంటకు గిట్టుబాటు ధర కల్పిస్తామంటూ ఎన్నికల సందర్భంగా రైతుకు హామీ ఇచ్చిన ప్రభుత్వం నేడు ఆ హామీని విస్మరించిందని దుయ్యబట్టారు. ఈ నేపథ్యంలో సీపీఐ, రైతు సంఘం బృందం అకాల వర్షం కారణంగా పంట నష్టపోయిన ప్రాంతాలలో పర్యటించి దెబ్బతిన్న పంటను పరిశీలించడం జరిగిందని, రైతు పెడుతున్న ఆక్రందనలు ప్రత్యక్షంగా విని సీఎం కార్యాలయ ముట్టడికి పిలుపునివ్వడం జరిగిందన్నారు. దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం చెల్లించాలని, రబీ సీజన్లో పండించిన ధాన్యం మొత్తాన్ని కొనుగోలు చేయాలని, మొక్కజొన్న, పసుపు పంటలకు ఎటువంటి నిబంధనలు లేకుండా కొనుగోలు చేయాలని కోరుతూ తలపెట్టిన ఈ ముట్టడి కార్యక్రమంలో రైతులు, కౌలు రైతులతో పాటు సీపీఐ, రైతు సంఘం నాయకులు, కార్యకర్తలు రైతు క్షేమాన్ని కోరే ప్రతిఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి, రైతు సంఘం జిల్లా కార్యదర్శి పచ్చల శివాజీ, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మేడా హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

అబ్దుల్ మతిన్‌ను ప్రభుత్వాలు ప్రోత్సహించాలి

విశాలాంధ్ర-గుంటూరు: ఏషియన్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకుని దేశానికే గర్వకారణంగా నిలిచిన షేక్ అబ్దుల్ మతిన్‌కు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మరింత ప్రోత్సాహం అందించాలని ముస్లిం ఐక్యవేదిక గౌరవాధ్యక్షులు షేక్ జియా ఉర్ రహమాన్ కోరారు. కేరళలోని అలపూజలో ఈ నెల 1 నుంచి 6వ తేది వరకు జరిగిన ఏషియన్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకుని గుంటూరుకు వచ్చిన అబ్దుల్ మతిన్‌ను, కోచ్ మహమ్మద్ ఖమురుద్దీన్‌ను స్థానిక ఆనందపేటలోని జియా ఉర్ రహమాన్ కార్యాలయంలో గురువారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రహమాన్ మాట్లాడుతూ అబ్దుల్ మతిన్ 190 కేజీల స్క్వాట్‌లో రెండో స్థానం, 80 కేజీల బెంజ్ ప్రెస్లో రెండవ స్థానం, 240 కేజీల డెడ్ లిఫ్ట్‌లో మొదటి స్థానం అలాగే మొత్తం మీద 500 కేజీలు పవర్ లిఫ్టింగ్‌లో ఏషియాలో రెండో స్థానం సంపాదించారన్నారు. మరిన్ని పోటీల్లో పాల్గొని పతకాలు సాధించడానికి అబ్దుల్ మతిన్ కుటుంబానికి ఆర్థిక స్థోమత లేదని, రాష్ట్ర ప్రభుత్వం తరుపున ఆర్థిక సహాయం అందజేయడంతో పాటు వారి కుటుంబానికి నివాస సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ముస్లిం ఐక్యవేదిక జనరల్ సెక్రటరీ హాజీ అబ్దుల్ కలాం, ఉపాధ్యక్షులు షేక్ బాజీ, యువజన నాయకులు పటాన్ అలీమ్ భాష, జాఫర్, అన్సారీ, జానీ, కోచ్ ఖమ్రుద్దిన్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ, ఎమ్మెల్యేల కృషితోనే వరకపూడి సెల సాధ్యం

విశాలాంధ్ర-వెల్దుర్తి: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ చింతా శివరామయ్య అధ్యక్షతన జరిగింది. కార్యక్రమంలో మండలంలో ఉన్న తాగు నీరు, విద్యా, వైద్యం, మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాలపై సమీక్ష నిర్వహించారు. వేసవిలో తాగునీటి అంతటి తలెత్తకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించారు. రానున్న విద్యా సంవత్సరంలో డ్రాప్స్ అవుట్స్ లేకుండా చర్యలు తీసుకోవాలని మాట్లాడారు. అలాగే ఇటీవల ఎంతో కాలంగా అపరిష్కృతంగా ఉన్నటువంటి వరికపూడి సెల ఎత్తిపోతల పథకానికి అన్ని అటవీ అనుమతులతో సహా మంజూరు చేయించిన పల్నాడు ఎంపీ శ్రీకృష్ణదేవరాయలుకి, మాచర్ల శాసనసభ్యులు ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డికి మండల ప్రజల తరపున కృతజ్ఞతలు తెలియజేస్తూ తీర్మానం చేశారు. అలాగే ప్రజల చిరకాల కోరికను తీర్చడానికి కృషి చేసిన వీరికి నాలుగు మండలాల ప్రజలు రుణపడి ఉంటారని జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షులు కుర్రి సాయిమర్కొండ రెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ తాడి వెంకటేశ్వర్ రెడ్డిలు అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ప్రసాదరావు, వైస్ ఎంపీపీలు సంజీవరెడ్డి, గోపాలు, జడ్పిటిసి బాలు నాయక్, పరుగులు సర్పంచులు, ఎంపీపీలు, మండల స్థాయి ఉద్యోగులు పాల్గొన్నారు.

బావను హతమార్చిన బావమరిది

విశాలాంధ్ర-పిడుగురాళ్ల: పిడుగురాళ్ల మండలం జానపాడు గ్రామంలో గోపి అనే వ్యక్తి హత్యకు గురైన ఘటన గురువారం చోటు చేసుకుంది. తన చెల్లిని తరచూ వేధిస్తున్నాడని ఆగ్రహించిన బావమరిది ఏడుకొండలు, బావ గోపిపై దాడి చేసి కత్తితో గొంతు కోశాడు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పంచలోహ విగ్రహానికి ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర-వట్టిచెరుకూరు: మండలంలోని అనంతవరప్పాడులో ఆంజనేయ స్వామి దేవాలయంలో దాతలు వితరణ ఇచ్చిన పంచలోహ విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా స్వామివారికి పంచామృతాలతో అభిషేకం 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణం చేశారు.

ఆలయ నిర్మాణ పనులు ప్రారంభం

విశాలాంధ్ర-వట్టి చెరుకూరు: చమళ్ళమూడి సీతారామస్వామి ఆలయ నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. శిథిల ఆలయ స్థానములలో నూతన ఆలయ పునర్ నిర్మాణము చేస్తున్నట్లు దేవాదాయ శాఖ అధికారులు తెలిపారు. 50 లక్షలతో నిర్మించడం జరుగుతుందన్నారు.

యువకుడి అదృశ్యం

విశాలాంధ్ర-వట్టిచెరుకూరు: మండలంలోని కొన్నిపాడుకు చెందిన యువకుడు అదృశ్యమైనట్టు వట్టిచెరుకూరు పోలీస్ స్టేషన్లో కేసు నమోదు అయింది. ఎస్సై కలగయ్య వివరాలు ప్రకారం కొన్నపాడు గ్రామానికి చెందిన ఈశ్వరరావు భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పైపులైనుకు లీకులు

విశాలాంధ్ర-వట్టిచెరుకూరు: మండలంలోని పుల్లడిగుంట గ్రామంలో గుంటూరుకి వెళ్లే రోడ్డులో పంచాయతీ మంచినీటి పైపులైన్ పగిలింది. పంచాయతీ పాలకవర్గం పట్టించుకోకపోవడంతో త్రాగునీరు ఇక్కడ వృధాగా పోతుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి పైపులైను మరమ్మతులు చేపట్టవలసిందిగా ప్రజలు కోరుచున్నారు.

14న ఉచిత కంటి వైద్య శిబిరం

విశాలాంధ్ర-పెదనందిపాడు: రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఈ నెల 14న స్థానిక అశోక్ ఉన్నత పాఠశాలలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు అధ్యక్ష కార్యదర్శులు విక్టర్ జాన్ పాల్, రామిరెడ్డి తెలిపారు. శంకర కంటి ఆసుపత్రి వైద్యులు ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పరీక్షలు చేపట్టనున్నారు.

లారీ ఢీకొని మహిళ మృతి

విశాలాంధ్ర-పిడుగురాళ్ల: పిడుగురాళ్ల పట్టణ సమీపంలోని కొండమోడు వద్ద రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ముత్తిపాటి లక్ష్మి అనే మహిళ మృతి చెందిన ఘటన గురువారం చోటు చేసుకుంది. పిడుగురాళ్ల మసీదు ఎదురుగా ఉన్న చరిష్మా సూపర్ మార్కెట్ వద్ద ఆకుకూరలు అమ్ముతూ జీవనం సాగించే లక్ష్మీ భర్తతో కలిసి నరసరావుపేట వెళుతుండగా వెనకనుండి వచ్చిన లారీ ఢీకొనడంతో లక్ష్మికి తీవ్ర గాయాలు కాగా శ్రీనివాసరావుకు కూతురికి స్వల్ప గాయాలయ్యాయి. లక్ష్మిని మెరుగైన చికిత్స నిమిత్తం నరసరావుపేట తరలించగా అక్కడి ఆసుపత్రి వారు ఎన్నారై హాస్పటల్‌కు తీసుకెళ్లమని చెప్పడంతో అక్కడకి వెళ్లే సమయంలో మార్గ మధ్యలో మృతి చెందినట్లు బంధువులు తెలిపారు.

ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం

విశాలాంధ్ర-ప్రత్తిపాడు: మండల పరిధిలోని యనమదలలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం నందున 57 మంది పేషెంట్లు హాజరయ్యారు. వారికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గొట్టిపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ శ్రీకాంత్, వైద్య అధికారులు పాల్గొన్నారు.

14న హనుమాన్ చాలీసా పరిద్దాం

విశాలాంధ్ర-తెనాలి: ఈ నెల 14వ తేదీన హనుమాన్ జయంతి సందర్భంగా లోక కళ్యాణం కోసం ఇంటిలోని అందరూ తప్పనిసరిగా హనుమాన్ చాలీసా పారాయణం ఒక్కసారి అయినా లేదా 11 సార్లు అయినా పారాయణం చేయాలని వరద రాజులు అన్నారు. హనుమంతుని ప్రార్థించి అందరం సుఖసంతోషాలతో ఆరోగ్యంతో ఆనందంగా ప్రశాంత మనస్సుతో జీవించాలని ఆకాంక్షిస్తూ ఈ కలియుగంలో పిలిచిన పలికే దైవం హనుమాన్ అని దయచేసి ప్రతి ఒక్క హిందువు హనుమంతుని ప్రార్థించాలని విజ్ఞప్తి చేశారు.

సుధీర్‌కు పితృ వియోగం

విశాలాంధ్ర-తెనాలి: తెనాలి సాక్షి పత్రిక విలేఖరి ఆలపాటి సుధీర్‌కు పితృవియోగం జరిగింది. గత వారం నుంచి అస్వస్థతతో విజయవాడ క్యాపిటల్ ఆస్పత్రిలో చికిత్స పొందిన ఆయన తండ్రి ఆలపాటి జీవరత్నం(76) గురువారం ఉదయం మృతి చెందారు. మారిస్‌పేట రెండు గట్ల మధ్య వారి స్వగృహంలో భౌతిక కాయం సందర్శనార్థం ఉంచడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్‌తో పాటు పలువురు భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

14న వీరభద్రేశ్వర ఆలయ ప్రతిష్ఠ

విశాలాంధ్ర-ముప్పాళ్ల : మండలంలోని తొండపి గ్రామంలో ఈ నెల 14వ తేదిన శ్రీ భీమేశ్వర వీరభద్రేశ్వర స్వామి ఆలయ ప్రతిష్టా మహోత్సవం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు, అన్నదానం జరుగుతుందని తెలిపారు. భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

మొక్కజొన్న రైతులు ఆర్బీకేలో సంప్రదించాలి

విశాలాంధ్ర-ముప్పాళ్ల: మండలంలో మొక్కజొన్న పంట వేసిన రైతులు రైతు భరోసా కేంద్రాల్లో సంప్రదించాలని ఏవో అరుణ గురువారం తెలిపారు. రైతులు ఆధార్ కార్డుతో వచ్చి నమోదు చేసుకుంటే ప్రభుత్వం కల్పించే గిట్టుబాటు ధరకు మొక్కజొన్న పంటను అమ్ముకోవచ్చని అన్నారు.

CHANGE OF NAME

I, **CHANNAMALLU VANI SIREESHA** (Old Name) W/o. **CHANNAMALLU SRINIVASA RAO**, R/o. Flat No.204, Sabarigiri Towers, 7/1 Lane, Chandramouli Nagar, Guntur - 522007, Guntur District, Andhra Pradesh, have changed my name to **PATHURI VANI SIREESHA**. Hereafter my name is known as **PATHURI VANI SIREESHA**.

CHANGE OF NAME

I, **KOMMINENI SREE LATHA** (Old Name) W/o. **MUSUNURU SRINIVASA RAO**, R/o. Flat No.406, Dharani Homes, 3/10 Vidya Nagar, Guntur - 522007, Guntur District, Andhra Pradesh, have changed my name to **KOMMINENI SRI LATHA**. Hereafter my name is known as **KOMMINENI SRI LATHA**.

BEFORE THE HON'BLE DEPUTY REGISTRAR OF CHITS / ARBITRATOR AT VIJAYAWADA.
I. A.No. 92/2022.
Arbitration Claim Petition No.293/2021.

Between:
MARGADARSI CHIT FUND PVT.LIMITED, Rep.by it's Sr. Manager cum Foreman, Labbipet Branch, Vijayawada-10.
- Petitioner/ Disputant.
and
MR.T.SRINIVASA RAO & OTHERS
- Respondents/ Opponents.

RESPONDENT NO.1/OPPONENT NO.1
MR.TATIKONDA SRINIVASA RAO, S/o.T.Varadaiah D No.11-450, Near T B Sanitorium, NC C Road Old Mangalagiri Mangalagiri, Guntur Dt., 522 903.

RESPONDENT No.2 / OPPONENT No.3
MR.KOTA ANJANEYULU, S/o. K.Kotaiah, D No.11-72, Near Ganesh Hotel, Sri Ram nagar, Yarrabalem, Mangalagiri (M) Guntur Dt.,

Please take notice that the above Petition filed by the Petitioner/ Disputant for attachment of Immovable property against Opponent Nos. 1&3 before judgement is posted to **19.05.2023** for your appearance. In case of your failure to appear before the Hon'ble Deputy Registrar of Chits/ Arbitrator, D.No.56-6-7A, Maruthi Colony, Opp:Priya Children Hospital, Pantakaluva Road, Patamate, Vijayawada-10 **at 10.00 A.M.** on **19.05.2023** either in person or through an advocate Failing which matter will be decided exparte.
(By order of the Hon'ble Deputy Registrar of Chite Arbitrator)

SUNKARA RAJENDRA PRASAD
VIJAYAWADA. ADVOCATE
28.04.2023. FOR DISPUTANT

ప్రమాదవశాత్తు వలంటీర్ మృతి

విశాలాంధ్ర-పొన్నూరు: పొన్నూరు మండలం మన్నవ గ్రామంలో గురువారం విషాదం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన వలంటీర్ అన్నవరపు మానస దుస్తులు ఉతకటానికి వెళ్లి ప్రమాదవశాత్తు తుంగభద్ర డ్రైన్‌లో పడిపోయింది. గమనించిన స్థానికులు హుటాహుటిన గాలింపు చర్యలు చేపట్టారు. కొంత దూరం కొట్టుకుపోయిన మానసను బయటకు తీశారు. అప్పటికే ఆమె మృతి చెంది ఉంది. ఈ సంఘటనతో గ్రామంలో పెద్ద ఎత్తున విషాదఛాయలు అలముకున్నాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పొన్నూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై పొన్నూరు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇసుక లోడ్ చేస్తుండగా యువకుడు మృతి

విశాలాంధ్ర-తాడేపల్లి: గుంటూరు జిల్లా తాడేపల్లి పరిధి గుండిమెడ ఇసుక రీచ్లో అనుమానాస్పదస్థితిలో యువకుడు మృతి చెందిన ఘటన బుధవారం రాత్రి చోటు చేసుకుంది. తాడేపల్లి పోలీసులు తెలిపిన వివరాల మేరకు జేసీబీతో ఇసుకను లోడింగ్ చేసే క్రమంలో ట్రాక్టర్‌లో యువకుడు ఇసుకను సరిచేస్తున్నాడని చెప్పారు. ఈ క్రమంలో గమనించని జేసీబీ డ్రైవర్ ఇసుకను లోడింగ్ చేశాడని, దీంతో ఊపిరాడక ప్రత్తిపాడుకు చెందిన బందారు వర్మ(21) అక్కడిక్కడే మృతిచెందాడని తెలిపారు. మృతదేహాన్ని మణిపాల్ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు తెలిపారు. అయితే మృతుడు ప్రమాదవశాత్తూ మరణించాడా లేక మరేదైనా జరిగిందా అనేది పోలీసుల విచారణ అనంతరం తేలాల్సి ఉంది.

వృద్ధుల ఆశ్రమంలో ఉచిత ప్రవేశాలు

విశాలాంధ్ర-గుంటూరు క్రైమ్: స్థానిక శ్రీనగర్ ఏడవ లైనులో గల మాతృశ్రీ వృద్ధుల ఆశ్రమంలో వృద్ధులకు ఉచిత ఆశ్రయం కల్పిస్తున్నట్లు నిర్వాహకులు నడింపల్లి జానకి శైలజ ఒక ప్రకటనలో తెలిపారు. అనాథ వృద్ధులు, పనుల ఒత్తిడిలో కుటుంబాలలోని వయోవృద్ధుల కోసం ఉచిత వసతి, భోజనం, వైద్య సదుపాయాలు కల్పిస్తున్నామని చెప్పారు. వివరాలకు 9848406465, 7288809389లలో సంప్రదించాలన్నారు.

ఆక్యుప్రెషర్ చికిత్స శిబిరానికి విశేష స్పందన

విశాలాంధ్ర-తాడేపల్లి: ఆక్యుప్రెషర్ చికిత్స శిబిరానికి విశేష స్పందన లభించిందని రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి అధ్యక్షులు మున్నంగి వివేకానంద రెడ్డి అన్నారు. ఎంటీఎంసీ పరిధిలోని ఉండవల్లి సెంటర్ వంశీ టాలెంట్ హైస్కూల్లో ఏర్పాటుచేసిన ఆక్యుప్రెషర్ చికిత్సా శిబిరాన్ని గురువారం మొదటిరోజు రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి ప్రతినిధుల బృందం ప్రారంభించారు. ఈ సందర్భంగా రోటరీ అధ్యక్షులు మున్నంగి వివేకానంద రెడ్డి మాట్లాడుతూ రోటరీ క్లబ్ తాడేపల్లి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆక్యుప్రెషర్ చికిత్స శిబిరానికి మొదటి రోజు విశేష స్పందన లభించిందని అన్నారు. ఈ ఆక్యు ప్రెషర్ శిబిరం 16వ తేదీ వరకు జరుగుతుందని, మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. అతి తక్కువ రూ.200 నామినల్ ఫీజుతో ఆక్యుప్రెషర్, మాగ్నటిక్, వైబ్రేషన్ థెరపి సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. మహిళలకు ప్రత్యేకంగా మహిళా థెరపిస్ట్ ద్వారా చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి వైస్ ప్రెసిడెంట్ కిరణ్ పరుచూరి, ట్రెజరర్ రామకృష్ణ శెట్టి, కొల్లి వెంకట చంద్రశేఖర్ రెడ్డి, జొన్నా రాజేష్, సుకుమార్ రెడ్డి, సుబ్బారెడ్డి, రవీంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అత్యధిక మెజారిటీ అందిస్తాం

విశాలాంధ్ర-మంగళగిరి: మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలో వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థిని అత్యధిక మెజారిటీతో గెలిపించుకుంటామని మంగళగిరి-తాడేపల్లి నగర వైసీపీ అధ్యక్షులు దొంతిరెడ్డి వేమారెడ్డి అన్నారు. మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలోని ఎమ్మెల్యే కార్యాలయంలో గురువారం నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మంగళగిరి-తాడేపల్లి నగర వైసీపీ అధ్యక్షుడిగా తనకు అవకాశం కల్పించిన సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. నియోజక వర్గంలో చిన్న చిన్న మనస్పర్థలు, సమస్యలు ఉన్నా వాటన్నిటినీ అధిగమించి మరోసారి మంగళగిరిలో వైసీపీ జెండా ఎగురవేసేందుకు అందరూ సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం మంగళగిరి అంబేద్కర్ సెంటర్లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తాడేపల్లి మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ రామకృష్ణారెడ్డి, మాజీ కౌన్సిలర్లు రఫీ, గోరె బాబు, మైనార్టీ నేత ఇక్బాల్ పాల్గొన్నారు.

పెండింగ్ పనులు త్వరగా పూర్తిచేయాలి

విశాలాంధ్ర-చేబ్రోలు: పెండింగ్ పనులు వేగవంతంగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య పేర్కొన్నారు. మండల పరిషత్ సమావేశ మంది రంలో గురువారం ఎంపీపీ కొక్కిలి గడ్డ సాహితి అధ్యక్షతన జరిగిన సర్వ సభ్య సమావేశంలో ఆయన మాట్లా డుతూ మండలంలోని అన్ని గ్రామా ల్లో ప్రభుత్వం చేపట్టిన పనులను పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ప్రతి గ్రామంలో ప్రజలకు అధికారులు అందుబాటులో ఉండాలన్నారు. ఎంపీపీ, ఎంపీడిఓ, వైసీపీ నేతలు పాల్గొన్నారు.

పడకేసిన పరిశుధ్యం

విశాలాంధ్ర-చేబ్రోలు: పంచాయతీ పరిధిలో పారిశుధ్యం అధ్వానంగా ఉంది. చేబ్రోలు పంచాయతీ పరిధిలో గొల్లపాలెం, పశువుల వైద్యశాల, చేబ్రోలులో రోడ్ల పక్కనే చెత్త చెదారం పడవేస్తున్నారు. దీంతో ఆ ప్రాంతంలో పందులు, కుక్కలు, ఆ వ్యర్ధల రోడ్డు పై చిందరబందరుగా చేస్తున్నాయి. ఆ జంతువులు కరుచుకుంటు స్థానిక ప్రజలను కూడా కరుస్తున్నాయని ఆప్రాంత ప్రజలు తెలుపుతున్నారు. ఇప్పటికైన పంచాయతీ అధికారులు స్పందించి రోడ్ల పక్కన వ్యర్థలను ఎప్పటికప్పుడు తొలగించాలని కోరుతున్నారు.

విద్యార్థినికి రూ.17 వేలు ఆర్థిక సహాయం

విశాలాంధ్ర-తాడేపల్లి: ఎంటీఎంసీ పరిధి ఉండవల్లికి చెందిన పట్నాల భావన, తెనాలి గుప్తా కాలేజీలో ఎమ్మెస్సీ కెమిస్ట్రీ మూడవ సంవత్సరం చదువుతోంది. కాలేజీ ఫీజు కట్టుకోలేని పరిస్థితుల్లో ఉన్నామని పట్నాల భావన వారి తండ్రి పట్నాల శంకర్, రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి అధ్యక్షులు మున్నంగి వివేకానంద రెడ్డిని సంప్రదించగా గురువారం రోటరీ క్లబ్ తాడేపల్లి ఆధ్వర్యంలో ఉండవల్లి వంశీ టాలెంట్ హైస్కూల్లో భావన తండ్రికి కాలేజీ ఫీజు నిమిత్తం రూ.17 వేల చెక్కును అందజేశారు. రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి వైస్ ప్రెసిడెంట్ కిరణ్ పరుచూరి, ట్రెజరర్ రామకృష్ణ శెట్టి, కొల్లి వెంకట చంద్రశేఖర్ రెడ్డి, జొన్నా రాజేష్, సుకుమార్ రెడ్డి పాల్గొన్నారు.

విశాలాంధ్ర
పల్నాడు జిల్లా

ఈపూరు మార్కెట్ యార్డు కమిటీ చైర్మన్‌గా చుండూరి

విశాలాంధ్ర-శావల్యాపురం: ఈపూరు వ్యవసాయ మార్కెట్ యార్డు నూతన పాలకవర్గాన్ని నియమిస్తూ ప్రభుత్వం జీవో విడుదల చేసిందని ఎంపీపీ ముండ్లమూరి సుహాసిని అనిల్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు గౌరవ అధ్యక్షుడిగా, శావల్యాపురం మండలం కారుమంచి గ్రామానికి చెందిన చుండూరి వెంకటేశ్వర్లు అధ్యక్షునిగా, మేళ్ళవాగు గ్రామానికి చెందిన బెలంశ్రీ రామిరెడ్డి ఉపాధ్యక్షుడిగా, దీంతో పాటు పలు గ్రామాలకు చెందిన మరో 17 మంది సభ్యులతో కూడిన పాలకవర్గాన్ని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో జారీ చేసిందని తెలిపారు. ఈ నెల 15వ తేదిన ఈపూరు మార్కెట్ యార్డు కార్యాలయంలో ప్రమాణస్వీకార కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆయనతో పాటు సొసైటీ చైర్మన్ నాగులపాటి చెన్నయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు తుమాటి కబ్బారావు, నాగులపాటి శ్రీనివాసరావు, అబ్బూరి అయ్యన్న, పచ్చవ శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

చుండూరి రాజకీయ ప్రస్థానం

శావల్యాపురం మండలం కారుమంచి గ్రామానికి చెందిన చుండూరి వెంకటేశ్వర్లు కాంగ్రెస్ పార్టీ పట్ల విధేయతతో ఆ పార్టీలో రాజకీయ ప్రస్థానం ప్రారంభించారు. గ్రామ స్థాయి నాయకుడి నుంచి మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయిలో ఆయన గుర్తింపు పొందారు. మండలంలో కీలక నేతగా ఉన్న 'చుండూరి' తన జీవితంలో ఎన్నో ఎత్తు పల్లాలను చవిచూశారు. తన పార్టీ అధికారంలో ఉన్నా లేకున్నా తనను నమ్ముకున్న ప్రజల కోసం అదేబాటలో నడిచారు. ఇతర పార్టీల నుంచి పలు మార్లు ఒత్తిళ్లు వచ్చినా, పదవులు ఆశచూపినా చలించలేదు చుండూరి. సామాజికవర్గ అండదండలు పుష్కలంగా, నిబద్ధతతో కూడిన రాజకీయాలు చేసిన చుండూరి ఓ దశలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థి రేసులోనూ నిలిచారు. పలువురు ఎమ్మెల్యేలతో సన్నిహితంగా మెలిగిన చుండూరి, రాష్ట్ర విభజన అనంతరం పరిస్థితులు, వైసీపీ ఆవిర్భావ నేపథ్యంలో వైఎస్సార్‌పై ఉన్న విధేయతతో, వైసీపీలో చేరారు. వైసీపీలో మండల కన్వీనర్‌గా సుదీర్ఘకాలం సేవలందిస్తూ, ప్రతిపక్షంలో ఉన్న సమయంలోనూ వైసీపీ జెండా మండలంలో రెపరెపలాడించారు. టీడీపీకి బలమైన శావల్యాపురం లాంటి మండలాల్లో 'చుండూరి'లా పోరాటపటిమ చూపిన నాయకులు లేరంటే అతిశయోక్తి కాదు. ఎంతో మంది సర్పంచ్‌లకు, ఎంపీటీసీ, జడ్పీటీసీలకు రాజకీయ ఓనమాలు దిద్దిన చుండూరి ఎన్నో ఎన్నికల్లో పోటీ చేశారు. గెలుపు ఓటములు సమంగా చూసే చుండూరి ఇటీవల జడ్పీటీసీ స్థానానికి పోటీపడి స్వల్ప మెజార్టీతో ఓడిపోయారు. ఎన్నో పదవులు, ఎన్నో విజయాలు చూసిన చుండూరి ఎప్పటిలానే యాక్టివ్‌గా రాజకీయాల్లో ఉన్నారు. ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడుకు సన్నిహితునిగా ఉన్న చుండూరికి ఈపూరు మార్కెట్ యార్డు పదవి లభించింది. సుదీర్ఘ రాజకీయ అనుభవం కలిగిన 'చుండూరి' సేవలను విరివిగా వినియోగించుకునే వ్యూహంలో భాగంగానే 2024 ఎన్నికల్లో ఎత్తులు, పైఎత్తులు, వ్యూహాలు పన్నడంలో దిట్ట అయిన 'చుండూరి'ని కీలకమైన యార్డు చైర్మన్ పదవికి ఎంపిక చేసినట్లు తెలుస్తోంది.

మార్కెట్ యార్డుని అభివృద్ధి పథంలో నడిపిస్తా-చుండూరి

ఈ సందర్భంగా చుండూరి వెంకటేశ్వర్లు విశాలాంధ్రతో మాట్లాడుతూ పార్టీ కోసం శ్రమించిన వారందరికీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి, స్థానిక శాసనసభ్యుడు బొల్లా బ్రహ్మనాయుడు ఏదో విధంగా న్యాయం చేస్తున్నారని తెలిపారు. నిత్యం రైతులకు అందుబాటులో ఉండి రైతుల సంక్షేమానికి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, మార్కెట్ యార్డుని అభివృద్ధి పథంలో నడిపిస్తానని అన్నారు. మా కుటుంబానికి ఈ పదవిని ఇచ్చిన ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడుకి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

సంక్షేమ పథకాలు సమర్థవంతంగా అమలవ్వాలి

విశాలాంధ్ర-నరసరావుపేట: కేంద్ర ప్రభుత్వం పేద, బడుగు, బలహీన వర్గాలకు అందిస్తున్న సంక్షేమ పథకాలు జిల్లాలో సమర్ధవంతంగా అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని భారత ప్రభుత్వ సామాజిక, సాధికారిత కమిటీ సభ్యులు తురకా నరసింహం జిల్లా అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో గురువారం జిల్లా కలెక్టర్ శివ శంకర్ లోతేటిని ఆయన మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుపై సమీక్షా కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల్లో పేద, బడుగు, బలహీన వర్గాల కోసం నేషనల్ లైవ్ స్టాక్ మిషన్, నేషనల్ డైయిరీ డెవలప్ మెంట్ బోర్డ్, ఎస్సీ, ఎస్టీ, సామాజిక వర్గాల వారి కోసం వెంచర్ క్యాపిటల్ ఫండ్, క్రెడిట్ గ్యారంటీ స్కీమ్, ఎం.ఎస్.ఎం.ఈ పథకాలతో పాటు స్టాండ్ అప్ ఇండియా వంటి పథకాలు రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పేదలకు అందిస్తున్నాయని పేర్కొన్నారు. నూజెండ్ల మండలంలో మహిళా గ్రూపులను కలుపుకొని డైయిరీ డెవలప్ మెంట్ పైలెట్ ప్రాజెక్ట్ కింద పెద్ద ఎత్తున పశువుల ద్వారా పాల ఉత్పత్తి కేంద్రాలను ఏర్పాటు చేసి, వాటి ద్వారా పేద మహిళా గ్రూపులకు పెద్ద ఎత్తున ప్రయోజనం కలిగేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ శివ పేర్కొన్నారు. న్యూఢిల్లీకి చెందిన డాక్టర్ లక్ష్మయ్య ఐ.ఏ.ఎస్. అకాడమి చైర్మన్, కేంద్ర ప్రభుత్వ పథకాల నిర్వహణ జిల్లా అధికారులు పాల్గొన్నారు.

14న ఉచిత ఖత్నా కార్యక్రమం

విశాలాంధ్ర-మాచర్ల: మాచర్ల నియోజకవర్గం ముస్లిం యూత్ కమిటీ, హాజీ బాజీ భాయ్(చికెన్) ఆధ్వర్యంలో ఈ నెల 14న పట్టణంలో ఉచిత ఖత్నా(సున్తీ) కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు కమిటీ సభ్యులు గురువారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్యక్రమం పట్టణంలోని జండా చెట్టు ప్రాంతంలో ఉన్న ముస్లిం షాది ఖానాలో నిర్వహించడం జరుగుతుందన్నారు. సున్తీ చేయించుకునేందుకు సిద్ధమైన వారు ముందుగా కమిటీ సభ్యులైన మౌజన్ అబ్దుల్లా, జానీ(కేసీపీ), అమీర్ క్లినిక్‌లకు సమాచారం అందించాల్సి ఉందన్నారు. కార్యక్రమం ఉదయం 6 గంటల నుంచి ప్రారంభమవుతుందని, మరిన్ని వివరాలకు సెల్ 8500806468, 9912964389 నెంబర్లను అందుబాటులో ఉంచడం జరిగిందన్నారు. ఈ అవకాశాన్ని నియోజకవర్గ పరిధిలోని ముస్లింలు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

కల్యాణ కానుక అందజేత

విశాలాంధ్ర-పిడుగురాళ్ల: పిడుగురాళ్ల పట్టణంలోని పల్నాడు హాస్పిటల్స్‌లో కల్యాణ కానుక కిట్‌ను చింతలపూడి బ్రదర్స్ బాబాయ్ అయిన గుంటుపల్లి రామారావు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా బంగారపు తాళి బొట్టుతో పాటుగా పట్టుచీర, సారెను వధువు నీలిమకు ఇచ్చి దీవించారు. అనంతరం నీలిమ తల్లి లక్ష్మీ మాట్లాడుతూ పెళ్లి అంటే ఒక సంబరం లాంటిదని అంత గొప్ప సంబరానికి సొంత అన్నయ్యలుగా ఎన్నారై శ్రీనివాసరావు, డాక్టర్ అశోక్ కుమార్ కొండంత అండగా నిలబడి హిందువులకు అత్యంత పవిత్రమైన తాళి బొట్టును పెళ్లి కుమార్తెకు ఇవ్వడం చాలా సంతోషమన్నారు.

నగదు చోరీ

విశాలాంధ్ర-పిడుగురాళ్ల: పిడుగురాళ్ల పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్డు వద్ద నగదు బ్యాగును చోరీ చేసిన ఘటన గురువారం చోటు చేసుకుంది. పిడుగురాళ్ల మండలం బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన నిమ్మల నరసింహారెడ్డి సెంట్రల్ బ్యాంకులో భార్యతో కలిసి రూ. 1.60 లక్షల నగదును డ్రా చేసుకొని తిరిగి ఇంటికి వెళ్తున్న సమయంలో రైల్వే స్టేషన్ రోడ్డు వద్దకు వచ్చి కొబ్బరి బోండాలు కొట్టించుకొను చుండగా బండికి తగిలించిన బ్యాగును గుర్తు తెలియని వ్యక్తులు లాక్కుని పారిపోవడం జరిగిందని నరసింహారెడ్డి తెలిపారు.

బొడ్డురాయికి పూజలు

విశాలాంధ్ర-పెదనందిపాడు: మండల పరిధిలోని నాగులపాడు గ్రామంలో బొడ్డు రాయి వార్షికోత్సవం సందర్భంగా భక్తులు గోవింద నాగవర్తిని దంపతులు పాలాభిషేకంతో పాటు విశేష పూజలు చేశారు. భక్తులకు ప్రసాదం అందచేశారు.

ఇళ్ల పట్టాల పంపిణీ

విశాలాంధ్ర-పిడుగురాళ్ల: పట్టణంలోని లెనిన్ నగర్‌లో 320 మంది లబ్ధిదారులకు గురువారం ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత లెనిన్ నగర్ కు మౌలిక వసతులు కల్పించి కాలనీ రూపు రేఖలు మార్చామని అన్నారు. కాలనీకి రోడ్లు, విద్యుత్, డ్రైనేజీ వ్యవస్థ కల్పించి ఈరోజున 320 మంది పేదలకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేసిన ఘనత జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వానిదే అని అన్నారు. అతి త్వరలోనే పక్కా గృహాలు కట్టుకునేందుకు ఒక్కో లబ్ధిదారునికి రెండు లక్షల వరకు ప్రభుత్వం నుండి సాయం అందేలా చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పట్టణ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అర్జీలు సక్రమంగా పరిష్కరించాలి

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: ప్రజలు సమస్యలపై అందించిన అర్జీలను అధికారులు సక్రమంగా పరిష్కరించేలా నిరంతరం పర్యవేక్షించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.కే.ఎస్.జవహర్ రెడ్డి జిల్లా కలెక్టర్లకు సూచించారు. గురువారం రాష్ట్ర సచివాలయం నుండి సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు, ఆరోగ్యం, స్త్రీ శిశు సంక్షేమ శాఖ, స్కూల్ ఎడ్యుకేషన్, గ్రామ / వార్డు సచివాలయాల నిర్వహణపై జిల్లా కలెక్టర్లతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో గుంటూరు కలక్టరేట్ వీసీ సమావేశ మందిరం నుండి కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి, సంయుక్త కలెక్టర్ రాజ కుమారి, జెడ్పీ సిఈఓ మోహన్ రావు, డియంఅండ్‌హెచ్ఓ డా.శ్రావణ్ బాబు, డిఈఓ శైలజ, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ విద్యార్థులను అభినందించిన చైర్‌పర్సన్

విశాలాంధ్ర-తెనాలి: తెనాలి పురపాలక సంఘంలోని 6మున్సిపల్ ఉన్నత పాఠశాలల నందు ఎస్ఎస్‌సీ ఫలితాలలో ఎక్కువ మార్కులు సాధించిన విద్యార్థినీ, విద్యార్థులకు కౌన్సిల్ హాలులో గురువారం అభినందన సభ జరిగింది. ఈ సభకు తెనాలి పురపాలక చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదా నసీమ్, తెనాలి మున్సిపల్ కమిషనర్ ఎం.జశ్వంతరావు, అసిస్టెంట్ కమిషనర్ ఎం.గోపాలరావు, మున్సిపల్ మేనేజర్ కె.అప్పలరాజు, వైస్ చైర్మన్ ఎం.హరిప్రసాద్, 35వ వార్డు కౌన్సిలర్ హరేరామ్, 6వ మున్సిపల్ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఎక్కువ మార్కులు సాధించిన విద్యార్థులను అభినందించి మెమెంటోలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు.

పీఎంఎఫ్ఎంఈ స్కీంను ఉపయోగించుకోవాలి

విశాలాంధ్ర-రాజుపాలెం: రాజుపాలెం మండలం ఉద్యాన అధికారి డి.నవీన్ కుమార్ అనుపాలెంలోని ఆర్‌బీకె నందు రైతులకు సమావేశం నిర్వహించారు, మామిడి రైతులకు వేసవి కాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి తెలిపారు. అదేవిధంగా పీఎంఎఫ్ఎంఈ స్కీం కింద మండలంలో మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్స్‌కి సబ్సిడీ 35శాతం యూనిట్‌కి అందజేస్తామని తెలియ జేశారు. పీఎంఎఫ్ఎంఈ స్కీంను అందరు నిరుద్యోగ యువత ఉపయోగించు కోవాలని కోరారు. అలాగే ఆర్‌బీకె ద్వారా జనుము, జీలుగ, పిల్లిపెసర భూమిలో వేసుకొని భూమి సారంను పెంచుకోవాలని, లోతు దుక్కులు వేసుకోవాలని మిరప రైతులకు తెలియజేశారు.

బ్యూటీషియన్ శిక్షణతో మహిళలకు భరోసా

విశాలాంధ్ర-మాచర్ల: అభయ ఫౌండేషన్, సీడ్ సంస్థ సహకారంతో శ్రీ సత్యసాయి సేవా సమితి వారి ఆధ్వర్యంలో బ్యూటీషియన్ కోర్సు శిక్షణ పూర్తిచేసిన మహిళలకు గురువారం సర్టిఫికెట్, బ్యూటిఫికేషన్ కిట్లను అందజేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా సత్యసాయి సేవా సమితి కన్వీనర్ జక్కా శ్రీనివాసరావు, సత్యసాయి ఎడ్యుకేషనల్ ప్రెసిడెంట్ అక్కినేని అనిల్, డాక్టర్లు బృంగ లక్ష్మీప్రసన్న, ఉదయభాను సత్యసాయి విద్యా విహార్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమాదేవి, నిమ్మగడ్డ సురేఖ హాజరయ్యారు. సత్యసాయి సేవాసమితి జిల్లా ఐటి కోఆర్డినేటర్ సురేష్ కుమార్, జల్ల సీతామహాలక్ష్మమ్మ, భవాని, కోమలి, త్రివేణి, పార్వతి, నాగమణి, అఖిల, కస్తూరి, ఆబిద, అన్నపూర్ణ, జ్యోతి, రామలక్ష్మి, ఉష, లక్ష్మీ నరసమ్మ, భవాని, శ్రీలక్ష్మి, జరీనా లీల, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాలో సమస్యలు రాకూడదు

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: నగరంలో త్రాగునీటి సరఫరాలో ఎక్కడా సమస్యలు రాకుండా ఇంజినీరింగ్ అధికారులు, ఎమినిటి కార్యదర్శులు పక్కా ప్రణాళికతో విధులు నిర్వహించాలని, సరఫరాలో సమస్యలు వస్తే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి స్పష్టం చేశారు. గురువారం కమిషనర్ వెంగళాయపాలెంలోని నగరపాలక సంస్థ సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ పరిశీలించారు. వెంగళాయపాలెం చెరువుని పూర్తి స్థాయి సామర్థ్యం మేరకు నీటిని నిల్వ చేయడానికి, మోటార్ల మరమత్తులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఎస్.ఈ.ని ఆదేశించారు. చెరువు పూర్తి స్థాయిలో నీటితో ఉంటే నగరంలోని ఏటి అగ్రహారం, హౌసింగ్ బోర్డ్ తదితర రిజర్వాయర్ల పరిధిలోని ప్రాంతాలకు సమృద్ధిగా త్రాగునీటిని సరఫరా చేయగలమన్నారు. చెరువు నింపేందుకు ఎస్.ఎస్.పి.కెనాల్ ఆధారం కనుక ఇరిగేషన్ అధికారులతో చర్చించాలన్నారు. చెరువు పరిసరాల్లో ఏర్పాటు చేసిన వీధి ఆవుల సంరక్షణా కేంద్రాన్ని పరిశీలించిన కమిషనర్ సిబ్బందితో మాట్లాడుతూ ఆవులకు సకాలంలో ఆహారం అందించేలా చూడాలన్నారు. వారానికి రెండు రోజులు పశు వైద్యులు వచ్చేలా ఆ శాఖ జాయింట్ డైరెక్టర్ కు లేఖ రాయాలని ఎంహెచ్ఓని ఆదేశించారు. అనంతరం వెంకట రమణ కాలనీలో ఎన్.ఓ.సి.కి దరఖాస్తు చేసుకున్నభవనాలను పరిశీలించి ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల మేరకు మాత్రమే నగరంలో బహుళ అంతస్తు భవనాలు నిర్మాణాలు జరగాలని, నిబంధనలు ఉల్లంఘన చేస్తే తగిన చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. పర్యటనలో ఎస్.ఈ. భాస్కర్, ఎంహెచ్ఓ డాక్టర్ భాను ప్రకాష్, డిప్యూటీ సిటీ ప్లానర్ మూర్తి, ఏసిపి బాబురావు, ఈ.ఈ.లు సుందర్రామిరెడ్డి, కొండారెడ్డి, డి.ఈ.ఈ. రమేష్ బాబు, సర్వేయర్ సునీల్ కుమార్, టిపిఎస్ లక్ష్మణస్వామీ, ఏ.ఈ. నాగవేణి, శానిటరీ ఇన్స్పెక్టర్ మల్లికార్జునరావు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

నరసరావుపేట సుందరీకరణకు చర్యలు

విశాలాంధ్ర-నరసరావుపేట: నరసరావు పేట పట్టణం సుందరీకరణకు సమగ్ర చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ శివ శంకర్ లోతేటి పేర్కొన్నారు. నగరోదయం పేరుతో పట్టణాలను అందంగా తీర్చి దిద్దేందుకుగాను శంకరన్ హాల్ నందు జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజక వర్గాల పరిధిలో, అర్బన్ మున్సిపాలిటీలలో ప్రహరీ గోడలకు అందమైన రంగులు కార్యక్రమంపై ఆయా మున్సిపల్ కమీషనర్లు, సచివాలయ ఉద్యోగులతో బ్యూటిఫికేషన్ ఆఫ్ అర్బన్ సిటీస్‌పై కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. నరసరావు పేట పట్టణం, వినుకొండ, సత్తెనపల్లి తదితర మున్సిపాలిటి పరిదిలోని పట్టణాల్లో నగర సుందరీకరణకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పట్టణ ప్రాంతాల్లో ఉన్న ప్రధాన రహదారులు, అంతర్గత ప్రధాన రహదారులు, అంతర్గత రహదారుల వెంట ఉన్న ప్రహరీ గోడలకు అందమైన రంగులను వేసి అత్యంత రమణీయంగా, ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని కలెక్టర్ ఆదేశించారు. ఇందు కోసం ప్రణాళిక బద్ధంగా రహదారుల వెంట ఉన్న ప్రభుత్వ గోడలు, ప్రైవేటు గోడలు గుర్తించడం, వాటి పొడవు, వెడల్పు, వైశాల్యం వివరాలను వెంటనే సేకరించి నివేదికను తయారు చేయాలని ఆదేశించారు. అదే తరహాలో అనుభవం, నైపుణ్యం కలిగిన (ఆర్టిస్టులు) కళాకారుల ద్వారా ప్రహరీ గోడలకు అందమైన ఆకృతులతో బొమ్మలు వేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకోసం వారిని ఆహ్వానించి 500 అడుగులు వరకు పెయింటింగ్ వేసేందుకు సహకారం తీసుకోవాలని ఆదేశించారు. అందంగా రంగులతో ఆకర్షణీయంగా తీర్చి దిద్దిన వారికి ప్రథమ బహుమతిగా రూ.50 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.30 వేలు, తృతీయ బహుమతిగా రూ.20 వేలు పారితోషకం అందించటం జరుగుతుంది. చిన్నారులు, పెద్దలు, కళాకారులు వంటి 3 కేటగిరీల్లో గోడలకు అందమైన రంగులు వేసిన వారికి బహుమతులు, ప్రశంసాపత్రం అందించటం జరుగుతుంది. ఆశక్తి గల వారు వివరాలను 7680905745 కు నెంబరు నమోదు చేసుకోవాలని తెలిపారు. సమావేశంలో ఆయా శాఖల అధికారులు, సచివాలయ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతల ఆవేదనను పట్టించుకోని ప్రభుత్వం

విశాలాంధ్ర-రాజుపాలెం: రాష్ట్రంలో అకాల వర్షాలతో రైతులు భారీగా పంట నష్టపోతే కనీసం వైసీపీ ప్రభుత్వం రైతుల వైపు కూడా చూడటం లేదని, అధికారంలోకి రావడానికి మూడు వేల కోట్ల రూపాయలతో ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేస్తానన్న జగన్ ప్రస్తుతం రైతుల వద్ద తడిసిన ధాన్యాన్ని కూడా కొనటంలేదని సత్తెనపల్లి నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు చిన్నబోయిన రాఘవ యాదవ్ విమర్శించారు. ఈ మేరకు గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే, మంత్రి అంబటికి నియోజకవర్గంలో వర్షాలకు నష్టపోయిన పంటలను పరిశీలించే తీరిక కూడా లేదా? అని ప్రశ్నించారు. రైతులు పంట నష్టంతో ఇబ్బందులు పడుతుంటే గడపగడపకు అని తిరుగుతూ పాంప్లేట్లు పంచి పెడుతున్నారని, టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు 2016లో భారీ వర్షాలతో పంట నష్టపోతే కోడెల శివప్రసాదరావు 48 గంటల్లో పంట నష్టం అంచనా వేయించి. హెక్టారుకు రూ.15 వేలు అందించి రైతులను ఆదుకున్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. నేడు పంట నష్టం అంచనా దేవుడు కెరుగు కనీసం రైతును పలకరించే నాథుడే కరువయ్యారని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా అంబటి రాంబాబు పంట నష్టానికి పరిహారం అందేలా చేసి రైతులను ఆదుకోవాలని కోరారు.

'ది కేరళ స్టోరీస్' ఏపీలో బ్యాన్ చేయాలి

విశాలాంధ్ర-వినుకొండ: కేరళ స్టోరీస్ సినిమాను ఆంధ్రప్రదేశ్‌లో బ్యాన్ చేయాలని స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేసిన మజ్లిస్ పార్టీ, ఇతర ప్రజా సంఘాల నాయకులు, ఈ సందర్భంగా మజ్లిస్ పార్టీ అధ్యక్షులు బాజీద్ మాట్లాడుతూ కొన్ని రోజుల క్రితం విడుదలైన ది కేరళ స్టోరీ అనే చిత్రం 32,000 వేల మంది హిందూ యువతులను బలవంతంగా ఇస్లాం మతంలోకి మార్చి ఉగ్రవాద సంస్థ అయిన ఐసిస్‌లో చేర్చబడుతున్నారు అని ఒక కల్పిత కథనంతో ఆ చిత్ర దర్శకుడు సుదీప్ తోసేన్ చిత్రీకరించడం జరిగింది అని ఆ చిత్రం ద్వారా హిందూ - ముస్లింల మధ్య వైషమ్యాలు,మరియు మత ఘర్షణలు జరిగే విధంగా సుదీప్ తో సేన్ అనే దర్శకుడు చిత్రీకరించి ఆ సినిమాను ఈ నెల 05 న విడుదల చేయటం జరిగింది. అని తెలిపారు,ఆ చిత్రంలో చూపించిన విధంగా నిజమే అయితే 32,000 మంది పై పోలీస్ ఎఫ్ ఐ ఆర్ నమోదు కాలేదు,అదేవిధంగా న్యూస్ పేపర్లలో ప్రచురితం మీడియాలో ప్రసారం కాలేదు, ఇప్పటికే ఆ చిత్రం తమిళనాడు,పశ్చిమ బెంగాల్,కేరళ రాష్ట్రంలో నిషేధం ఉంది అని చెప్పారు. ది కేరళ స్టోరీస్ సినిమా తీసిన దర్శక, నిర్మాతలకు ఇటీవలే గుజరాత్ కు సంబంధించి జాతీయ నేర గణాంకాల సంస్థ ఇచ్చిన నివేదిక ప్రకారం గుజరాత్ లో కనబడకుండా పోయిన 42 వేల మంది యువతులపై సినిమా తీసే దమ్ము ధైర్యం ఉందా అని సూటిగా ప్రశ్నించారు.అదేవిధంగా మన ఆంధ్రప్రదేశ్లో కూడా ఆ చిత్రాన్ని నిషేధించాలి,ఆ చిత్రం పూర్తి అవాస్తవం అని వినుకొండ అఖిలపక్షం మరియు ప్రజా సంఘాల తరపున తీవ్రంగా ఖండిస్తు ఆ చిత్రాన్ని వెంటనే ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి రాష్ట్రంలో ఎక్కడ కూడా ప్రదర్శించకూడదు అని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో మజ్లీస్ పార్టీ అధ్యక్షులు బాజీద్,కలాముద్దీన్, వలిఖాన్,మైనార్టీ నాయకులు ఆయాజ్, సిపిఐ ఎంఎల్ పార్టీ నాయకులు తోట ఆంజనేయులు, ఫిరోజ్,సీతయ్య,మాల మహానాడు వెంకటేశ్వర్లు,బీసీ సంఘం నాయకులు నాగమల్లేశ్వరరావు,తదితరులు పాల్గొన్నారు.

చెత్త ద్వారా వచ్చే సంపాదన ఏమవుతోంది?

విశాలాంధ్ర-రాజుపాలెం: రాజుపాలెం మండలంలోని అన్ని గ్రామాల్లోని ఘన వ్యర్థాలపై యుద్ధం చేయాలని, ప్రతి ఇంటి నుండి వ్యర్థాల సేకరణ, విభజన, అనంతరం ఎస్‌డబ్ల్యూపీసీలో చెత్త సంపదగా మారే వరకు ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయం చేసుకుని లక్ష్యాలను సాధించాలని రాష్ట్ర జలవనరుల శాఖ మాత్యులు అంబటి రాంబాబు ఆదేశించిన అధికారులు, నిర్వాహకులు ఆ మాటలు గాలికి వదిలేశారు. ఆయా గ్రామ పంచాయతీల్లో ఏర్పాటు చేసిన చెత్తతో సంపద తయారీలో ప్లాస్టిక్ వాటర్ బాటిల్స్ దర్శనమిస్తూ కొన్ని కేంద్రాలు నిరుపయోగంగా మారాయి. సంపద కేంద్రాల వినియోగించక పోవడంతో గ్రామాల్లో ఎక్కడ బడితే అక్కడ చెత్తా చెదారం, మట్టి దిబ్బలు, ప్లాస్టిక్ వంటి వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. లక్షలాది రూపాయల ప్రజాధనం దుర్వినియోగం అయింది. పస్తుత ప్రభుత్వ హయాంలో దాదాపు కొన్ని గ్రామ పంచాయతీ కేంద్రంలలో జాతీయ ఉపాధి హామీ పథకం నిధులతో చెత్తతో సంపద తయారీ కేంద్రాన్ని నిర్మించారు. మండలంలోని 16 పంచాయతీల్లో గాను రెండు, మూడు తప్ప మిగతా అన్ని పంచాయతీల్లో వీటిని నిర్మించారు. చెత్త తరలింపు నిమిత్తం ప్రతి వెయ్యి మంది జనాభాకు ఒక క్లాప్ మిత్ర నియమించారు. చెత్తను సేకరించి కేంద్రాల్లో కుళ్లబెట్టాలి. ఆ తర్వాత వానపాములను వదిలి వర్మీ కంపోస్ట్ తయారు చేయాలి. ఆ గ్రామ రైతులకు ఆ ఎరువులను విక్రయించి. దానిని మార్కెటింగ్ చేయడం ద్వారా పంచాయతీలకు ఆదాయం వస్తుంది. అయితే సంపద నిర్మాణ కేంద్రాలలో ఈ ఎరువుల తయారీ జరగకపోవడంతో అవి నిరుపయోగంగా మారాయి. ఉదయాన్నే చెత్త సేకరణ సమయంలో ఫోటోలు తీసి జియో ట్యాగింగ్ చేయాలనే నిబంధన ఉండటంతో కొన్ని గ్రామాల్లో అంతవరకు చేస్తున్నారు. ఆ తర్వాత చెత్తను తీసుకెళ్లి గ్రామ శివారులో వేయడం లేదా సంపద కేంద్రాల పక్కనే పడవేసి తగలబెట్టడం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వీటిని ఉపయోగంలోకి తీసుకురావాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఎమ్మెల్యేకు కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల వినతి

విశాలాంధ్ర-వినుకొండ: వినుకొండ నియోజకవర్గం పరిధిలో పనిచేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ వినుకొండ శాసనసభ సభ్యులు బొల్లా బ్రహ్మ నాయుడు ని మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రాన్ని సమర్పించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటుచేసిన డాక్టర్ వై.యస్.ఆర్ విలేజ్ క్లినిక్స్ నందు కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ గా నేషనల్ హెల్త్ మిషన్ ద్వారా నియామకం జరిగి, 2019 నుండి గ్రామీణ ప్రాంతాలలో వివిధ రకాల వైద్య సేవలు అందిస్తూ.. వైద్య రంగంలో దేశంలోనే రాష్ట్రాన్ని ముందంజలో నిలుపుటలో కీలక పాత్ర పోషిస్తున్నారు . ఇటీవల ఉద్యోగుల సంఖ్య పెంచి దేశంలో ఎక్కడా లేని విధంగా అత్యధిక ఉద్యోగాలు ఇచ్చిన ముఖ్యమంత్రి కి నిండు మనసుతో కృతజ్ఞతలు. అలానే ఈ మధ్యకాలంలో యన్.హెచ్.యం పరిధిలో ఉన్న అన్ని కేడర్ ఉద్యోగులకు కాంట్రాక్ట్ పద్ధతిలో చాలీచాలని జీతంతో నెట్టుకొస్తున్న వారికి వేతన సవరణ చేసి సహాయపడిన ప్రభుత్వానికి హృదయపూర్వక కృతజ్ఞతలు . అదేవిధంగా యన్.హెచ్.యం లో పనిచేస్తున్న సి.హెచ్. ఒ' యస్ లకు కూడా ఆ వేతన సవరణ అమలుపరిచే విధంగా మార్గదర్శకాలు ఇప్పించి 10000 మంది ఉద్యోగులకు న్యాయం చేయగలరు అని ముఖ్యమంత్రి కి, వినుకొండ శాసనసభ సభ్యులు బొల్లా బ్రహ్మనాయుడు తరపున ముఖ్యమంత్రి కి మా సమస్య చేరే విధంగా ఆంధ్రప్రదేశ్ మెడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్ / కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ అసోసియేషన్ పల్నాడు జిల్లా అధ్యక్షులు నాగరాజు రాష్ట్రంలో పనిచేస్తున్న 10000 కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు తరపున వేడుకుంటున్నాము. ఈ కార్యక్రమంలో వినుకొండ నియోజకవర్గ పరిధిలో పనిచేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ సరిత ,రామకృష్ణ ,మాబు సుభాని పఠాన్ ,ఝాన్సీ, మేరీ వాణి, శ్రీను నాయక్,అశోక్ ,గౌసియా,గోపి, రమణా నాయక్, గురు ప్రియ, పార్వతి కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ పాల్గొనడం జరిగింది.

గ్రామీణ ప్రాంత ప్రజల అభివృద్ధి లక్ష్యంగా సీపీఐ

విశాలాంధ్ర-నాదెండ్ల: సీపీఐ పేద ప్రజల కోసం పనిచేస్తుందని సీనియర్ సీపీఐ నాయకులు పర్వతనేని హనుమంతరావు అన్నారు. నాదెండ్ల మండలం ఎండుగుంపాలెం గ్రామంలో జరిగిన మేడే అరుణ పతాక ఆవిష్కరణ కార్యక్రమంలో పర్వతనేని హనుమంతరావు పాల్గొని ఆవిష్కరించటం జరిగింది. అనంతరం ఎండుగుంపాలెం సీపీఐ పార్టీ శాఖ కార్యదర్శి పర్వతనేని లక్షాధికారి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో చిలకలూరిపేట సీపీఐ ఏరియా కార్యదర్శి నాగభైర రామసుబ్బాయమ్మ, కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీ గ్రామాలలో నివసిస్తున్న పేద ప్రజల సమస్యల కోసం నిరంతరం పోరాటాలు కొనసాగిస్తుందని, అధికారంలో ఉన్న లేకపోయినా గ్రామీణ ప్రాంత ప్రజల అభివృద్ధి ఏకైక లక్ష్యంగా పనిచేస్తుందని అన్నారు. అనంతరం పార్టీ సీనియర్ నాయకులు పర్వతనేని హనుమంతరావును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో చిలకలూరిపేట పట్టణ సీపీఐ కార్యదర్శి పేలూరి రామారావు, పల్నాడు జిల్లా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు తాళ్లూరి బాబురావు, ఆంధ్ర ప్రదేశ్ ప్రజానాట్య మండలి నాయకులు బొంతా నాగేశ్వరరావు, నియోజకవర్గ కౌన్సిల్ సభ్యులు సీఆర్ సృజన్, ఆంధ్రప్రదేశ్ మహిళా సంఘం చిలకలూరిపేట పట్టణ కార్యదర్శి బి లలిత కుమారి, శివ లీల, తోట నరసమ్మ, సిపిఐ నాయకులు బొంతా శేషయ్య, చంద్ర కొండలరావు , ముప్పాళ్ళ అమరలింగేశ్వరరావు, వేలూరు గ్రామ లెనిన్ యూనిట్ శాఖ కార్యదర్శి బొంతా భగత్ సింగ్, ఎండుగుంపాలెం గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఆర్కేకు ఇసుక దందా కనిపించటం లేదా?

విశాలాంధ్ర-తాడేపల్లి: మంగళగిరి ఎమ్మెల్యే ఆర్కేకు జరుగుతున్న ఇసుక దందా కనిపించటం లేదా అని జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు గాదె వెంకటేశరరావు ప్రశ్నించారు. పత్తిపాడు మండలం బోయపాడుకు చెందిన లారీ క్లీనర్ బందారు వర్మ(20 సంవత్సరాలు) తాడేపల్లి మండలం గుండెమెడ కృష్ణానది ఇసుక క్వారీలో టిప్పర్‌లో ఇసుక కూరుకుపోయి అనుమానస్పద స్థితిలో బుధవారం అర్ధరాత్రి మృతి చెందారు. దీనిపై విచారణ చేపట్టిన తాడేపల్లి పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని తాడేపల్లి మణిపాల్ అసుపత్రికి తరలించి, గురువారం పోస్టుమార్టం నిమిత్తం మంగళగిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చూసుకోకుండా టిప్పర్‌లో ఇసుక లోడ్ చేయటంతో జేసీబీ డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగానే యువకుడు మృతి చెందినట్లు పోలీసులు మీడియాకు తెలిపారు. యువకుని మృతి నేపథ్యంలో జనసేన జిల్లా అధ్యక్షులు గాదె వెంకటేశ్వరరావు, ఇతర జనసేన నాయకులు కలసి గుండెమెడ ఇసుక క్వారీని పరిశీలించారు. క్వారీ ప్రాంగణంలో ఇసుక వే బిల్లులను పరిశీలించారు. ఈ సందర్భంగా గాదె వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కృష్ణానది గర్భంలో ప్రకృతి సంపదను దోచుకుంటున్నారని ఆరోపించారు. గ్రీన్ ట్రిబ్యూనల్‌కు వ్యతిరేకంగా ఇసుక త్రవ్వకాలు జరుగుతున్నాయని, రాష్ట్రంలో ఇసుక సరఫరా చేసే జేపీ కంపెనీ జగన్ బినామీ అని ఆరోపించారు.సెబ్ అధికారులు పట్టించుకోవటం లేదని ఆరోపించారు. 15 హెక్టార్లకు అనుమతులు ఉంటే వందలాది హెక్టార్లలో ఇసుక దోపిడీ జరుగుతుందని గాదె వెంకటేశ్వరరావు అన్నారు. అక్రమాలు జరుగుతుంటే మంగళగిరి ఎమ్మెల్యే ఆర్కే ఎక్కడున్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కోర్టుపక్షిగా తిరిగిన ఎమ్మెల్యే ఆర్కే అధికారంలోకి రాగానే ఇక్కడ జరుగుతున్న ఇసుక అక్రమాలు సక్రమం అయ్యాయని అన్నారు. వెంటనే గుండెమెడ ఇసుక త్రవ్వకాలను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి బేతపూడి విజయ్ శేఖర్, జిల్లా నాయకులు ఎన్. ప్రసాద్, ఎన్.శివరామ కృష్ణ, మండల అధ్యక్షులు వాసా శ్రీనివాసరావు, యర్రబాలెం అధ్యక్షులు కాపరౌతు సుందరయ్య, పెద్దినేని వేణు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

యద్దనపూడిలో డీఎస్పీ పర్యటన

విశాలాంధ్ర యద్దనపూడి: గత రాత్రి మార్టూరు మండలంలో ఇసుక దరిశి సమీపంలో గల సూర్య దాబా వద్ద ఒక వర్గం మరో వర్గంపై జరిగిన దాడి నేపథ్యంలో గురువారం డీఎస్పి వెంకటేశ్వరరావు, సిఐ ఫిరోజ్ , ఎస్సై అనూక్ తో కలసి మండలంలోని పోలూరు, యద్దనపూడి, చింతపల్లిపాడు, గ్రామాలలో పర్యటించారు. ఘర్షణకు సంబంధించిన ఇరువర్గాలు యద్దనపూడి మండలానికి చెందిన వారు కావటంతో ఆ గ్రామాలను సందర్శించారు. ఎటువంటి ఆవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా తగిన చర్యలు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం స్టేషన్ కు చేరుకొని ఘర్షణకు గల కారణాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు ఈ సందర్భంగా గ్రామస్తులతో మాట్లాడుతూ ఆవేశాలకులోనై అల్లర్లకు తగాదాలకు పాల్పడవద్దని తద్వారా మీ జీవితాలు మీ కుటుంబ సభ్యుల జీవితాలు అంధకారంలో పడతాయని హితవు పలికారు. స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

రైతులను తక్షణమే ఆదుకోవాలి

- టీడీపీ ఇన్‌చార్జ్ వేగేశ్న నరేంద్ర వర్మ
- మంత్రి కారుమూరి క్షమాపణ చెప్పాలి
- కలెక్టరేట్ వద్ద టిడిపి నేతలు నిరసన
- జేసీ శ్రీధర్‌కు వినతి

విశాలాంధ్ర-బాపట్ల: రైతుల ఆరుగాల కష్టం అకాల వర్షం వర్షం దాటికి నష్టపోయిన రైతులను తక్షణమే ఆదుకోవాలని టిడిపి ఇంచార్జి వేగేశన నరేంద్ర వర్మ ప్రభుత్వాన్ని కోరారు. టిడిపి నేతలతో కలిసి గురువారం కలెక్టరేట్ వద్ద పార్టీ నాయకులతో కలిసి రైతులను ఆదుకోవాలని నినాదాలు చేశారు. అనంతరం జెసి శ్రీధర్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వేగేశన నరేంద్ర వర్మ మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో అకాల వర్షాలతో చేతికొచ్చిన పంట నష్టపోయి రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఇటీవల కురిసిన అకాల వర్షాలతో 4 లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయన్నారు. ఒకపక్క రైతులు ఇబ్బందులు పడుతుంటే వైసిపి ప్రభుత్వం నాన్చుడు ధోరణి అవలంబిస్తూ పంట నష్టం అంచనా వేయకుండా కాలయాపన చేస్తుందన్నారు. రైతులు పొలాల్లో ఉన్న పంటను కాపాడుకోవడానికి కనీసం టార్పాలిన్ పట్టాలు కూడా ఇవ్వకుండా మరింత కృంగదీస్తుందన్నారన్నారు. వరితో పాటు మిరప, మొక్కజొన్న,పసుపు, శనగ, వేరుశనగ, మామిడి, అరటి, ఇతర ఉద్యాన పంటలు బొప్పాయి, నిమ్మ, దానిమ్మ, బత్తాయి దెబ్బతిని రైతులు కోలుకోలేని విధంగా దెబ్బతిన్నారన్నారు. పొలాల్లో నీరు నిలవడంతో ధాన్యాన్ని పొలం నుంచి రోడ్డుపైకి చేర్చేందుకు రైతులు అధికమొత్తం ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. అధికారులు పంట నష్టం అంచనా వేసి త్వరితగతిన పరిహారం అందించాలని ప్రభుత్వాన్ని వేగేశన డిమాండ్ చేశారు . అకాల వర్షాలకు దెబ్బతిన్న, రంగుమారిన ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేయాలని రబీ ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలన్నారు. నాణ్యత కోల్పోయిన పంటలను కొనుగోలు చేసి నష్టపోయిన వరి, మొక్కజొన్న రైతుకు ఎకరాకు రూ.30 వేల చొప్పున మిర్చి, అరటి, మామిడి రైతులకు ఎకరాకు రూ.50 వేల పరిహారం అందించాలి. అదేవిధంగా పిడుగుపాటు గురై మరణించిన కుటుంబాలకు ప్రతి కుటుంబానికి రూ.25 లక్షల పరిహారం అందించాలన్నారు. బాధలో ఉన్న రైతులను ఎర్రి పప్ప అని గౌరవం లేకుండా దుర్భాషలాడిన మంత్రి కారుమూరి నాగేశ్వరరావు తక్షణమే వారికి బహిరంగ క్షమాపణ చెప్పాలని నరేంద్ర వర్మ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సలగల రాజశేఖర్ బాబు పమిడి భాస్కర్, పల్లం సరోజిని తదితరులు ఉన్నారు.

విశాలాంధ్ర బాపట్ల జిల్లా

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం

విశాలాంధ్ర-చీరాల: సిండికేట్ కాలనీ యూత్ వెంకట కళ్యాణ్ జ్ఞాపకార్థం చలివేంద్రాన్ని ప్రారంభించడం అభినందనీయమని, ఎండలు ఎక్కువగా ఉన్న సందర్భంలో మజ్జిగ పంపిణీ చేయడం మంచి కార్యక్రమమని, ప్రతి ఒక్కరు సామాజిక బాధ్యతతో ముందుకు వచ్చి సమాజ సేవలో పాల్గొనాలని డాక్టర్ తాడివలస దేవరాజు అన్నారు. ఇపురుపాలెం సిండికేట్ వివర్స్ కాలనీలో బూదాటి వెంకట కళ్యాణ్ జయంతి పురస్కరించుకొని సిండికేట్ కాలనీ యూత్ ఆధ్వర్యంలో చలివేంద్రన్ని ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శ్రీ కామాక్షి కేర్ హాస్పిటల్ ఎండి డాక్టర్ తాడివలస దేవరాజు పాల్గొన్నారు. బూదాటి నాగమల్లేశ్వరరావు, బూదాటి వెంకట్ కుమార్, ఉప్పురి రుద్ర శ్రీనివాస్, నాగమల్లి అరవింద్, రాజేష్, అర్జున్, సాయి, తేజ, సిండికేట్ కాలనీ యూత్ తదితరులు పాల్గొన్నారు.

సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ

విశాలాంధ్ర-రేపల్లె : తిరుమల తిరుపతి దేవస్థానములు శ్రీవాణి ట్రస్ట్ ఆర్థిక సహాయంతో సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో పట్టణం లోని ఒకటో వార్డు ఎస్టి కాలనీలో శ్రీ సీతా రాముల విగ్రహ ప్రతిష్ట మహోత్సవం వైభవంగా జరిగింది. శుక్రవారం ఉదయం తొమ్మిది గంటల 24 నిమిషాలకు శ్రీ నరేంద్ర రామానుజ స్వామి వారి స్వహస్తములతో ప్రతిష్టా మహోత్సవం జరుగుతుందని నిర్వాహకులు తెలియజేశారు. ఆలయ నిర్మాణ అభివృద్ధి కమిటీ సభ్యులు ఎస్ ఎస్ ఎఫ్ జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమ శంకరరావు, పేరం కోటేశ్వరరావు, డొక్కు వీరయ్య, నంబూరు వేణు అంకాలు, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణం తనిఖీ

విశాలాంధ్ర-పర్చూరు: పర్చూరు లోని ప్రభుత్వ మద్యం దుకాణాన్ని గురువారం అబ్కారీ అధికారులు తనిఖీ చేశారు. దుకాణంలో మద్యం నిలవల్లో వ్యాత్యాసం ఉన్నదని అందిన సమాచారం మేరకు అధికారులు తనిఖీలు నిర్వహించారు. నివేదికను ఉన్నత అధికారులుకు అందిస్తామని ఎస్సైలు సత్యనారాయణ, సుబ్బారావు తెలిపారు. వీరివెంట అబ్కారీ సిబ్బంది ఉన్నారు.

విద్యార్థులకు యోగా శిక్షణ

విశాలాంధ్ర-అద్దంకి: అద్దంకి శాఖా గ్రంధాలయం ఆధ్వర్యంలో విద్యార్థులకు నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన తరగతులలో భాగంగా గురువారం బుద్దిస్ సొసైటీ ఆఫ్ ఇండియా అద్దంకి ప్రెసిడెంట్ తాళ్ళూరి బాబూరావు విద్యార్దులకు యోగా శిక్షణ ఇచ్చారు. విద్యార్థులందరికీ గ్రంధపాలకులు చుండూరి సుగుణరావు నోట్ పుస్తకాలు, స్వీట్లు పంచి పెట్టారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి.

విశాలాంధ్ర-కర్లపాలెం: భవన నిర్మాణ సంక్షేమ బోర్డును తిరిగి ప్రారంభించి పెండింగ్ ఉన్న క్లెయిమ్స్ ను పరిష్కరించాలని ఏపీ భవన నిర్మాణ కార్మిక సంఘం గౌరవ అధ్యక్షులు పఠాన్ జలీల్ ఖాన్ తెలిపారు. ఈనెల 15వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా భవన నిర్మాణ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. సంఘం జిల్లా అధ్యక్షులు జల్లి భాగ్య శ్రీధర్ మాట్లాడుతూ మిగిలిన డబ్బులు ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి సంక్షేమ బోర్డు నిధులు దారి మళ్లించి కార్మికుల బతకులు వీధిపాలు చేశారన్నారు .జగన్ ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుండి భవన నిర్మాణ రంగ కార్మికుల పట్ల చవితి తల్లి ప్రేమ చూపు చూపుతున్నారన్నారు. కార్మికులను మోసం చేస్తున్న జగన్ మోహన్ రెడ్డిని ఇంటికి పంపాలన్నారు. సుమారు 32 వేల పెండింగ్ లో ఉన్న క్లెయిమ్స్ ని పరిష్కరించాలని 60 సంవత్సరములు నిండిన కార్మికులకు రు. 5 వేలు పింఛన్ ఇవ్వాలన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఐక్యతగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు షేక్ కరిముల్ల, కర్లపాలెం భవన నిర్మాణ అధ్యక్షుడు పిట్టు కాసుల్ రెడ్డి, అక్కల శ్రీనివాస్ రెడ్డి , పఠాన్ మస్తాన్ , షేక్ జిలాని తదితరులు పాల్గొన్నారు.

శుభకార్యాల్లో గొట్టిపాటి

విశాలాంధ్ర-అద్దంకి: మండలంలోని సాధునగర్ వాస్తవ్యులు గంటా నాగభూషణం (లేటు) సరస్వతి దంపతుల కుమార్తె వివాహం పురస్కరించుకొని గురువారం ఎమ్మెల్యే రవికుమార్ హాజరై నూతన వధువు నాగశ్రావణిని ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు.నాగులపాడు వాస్తవ్యులు జాగర్లమూడి వేణు,సౌజన్య దంపతుల కుమార్తె ఓణీల మహోత్సవానికి హాజరైన ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ చి,హర్షకు ఆశీస్సులు తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

విశాలాంధ్ర-చెరుకుపల్లి: గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన బుధవారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్సై వెంకట కొండారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం గుర్తుతెలియని 30 సంవత్సరాల వయసు కలిగిన వ్యక్తి గత రెండు రోజులుగా ఆహార పానీయాలు మాని మతిస్థిమితం లేనివాడిగా తిరుగాడుతూ మద్యం మత్తులో సంత బజారు చివరలో పాల కేంద్రం వద్ద రాత్రి సుమారు 10 గంటల ప్రాంతంలో మృతి చెందినట్లు వీఆర్వో ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

గూడవల్లి ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

విశాలాంధ్ర-చెరుకుపల్లి: గూడవల్లి ప్రభుత్వ ఐటిఐ లో 2023 24 విద్యా సంవత్సరానికి విద్యార్థుల నుండి ప్రవేశానికి దరఖాస్తులు కోరుతున్నట్లు ప్రిన్సిపాల్ జి.హుల్దాలాల్ తెలిపారు. అభ్యర్థులు దరఖాస్తులను ఆన్లైన్లో దరఖాస్తు చేయాలన్నారు. ఈనెల 10వ తేదీ నుండి జూన్ ఆరో తేదీ వరకు సాయంత్రం ఐదు గంటల లోపు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు తమ దరఖాస్తులను ap.gov.in సైట్లో దరఖాస్తు చేయాలన్నారు. వివరాలకు 99398650408-8648258622 నంబర్లలో సంప్రదించాలని తెలియజేశారు.

మహాయజ్ఞం జయప్రదం చేయాలి

విశాలాంధ్ర-యద్దనపూడి: ఈనెల 12 నుండి 17 వరకు విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ కార్పొరేషన్ స్టేడియంలో జరిగే చండీరుద్ర రాజశ్యామల సుదర్శన సహిత శ్రీలక్ష్మి మహాయజ్ఞం కార్యక్రమం జయప్రదం చేయాలని అద్దంకి ఎండోమెంట్ ఇన్స్పెక్టర్ పి శైలేంద్రకుమార్ అన్నారు. మండలంలోని పూనూరు ఎండోమెంట్ కార్యాలయంలో శ్రీ లక్ష్మీ మహాయజ్ఞ ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు. ఎండోమెంట్ ఈవో జ్యోతి రికార్డు అసిస్టెంట్ రామకృష్ణ అర్చకులు భావనాచార్యులు రాజ్కుమార్ శర్మ గ్రామస్తులు పాల్గొన్నారు.

రోడ్ల మరమ్మతులు చేయాలంటూ వినతి

విశాలాంధ్ర-వేటపాలెం: వేటపాలెం మండలం కొత్తపేట పంచాయతీ ప్రసాద్ నగరంలో కొద్ది రోజులలో హనుమాన్ జయంతి జరుగుతున్న సందర్భంగా గుడికి వెళ్లే రోడ్ అస్తవ్యస్తంగా ఉండడంతో రోడ్డును బాగు చేయించాలని ఆలయ కమిటీ సభ్యులు స్థానిక ఎమ్మెల్యే బలరాం కు, వైయస్సార్సీపి చీరాల ఇంచార్జ్ కరణం వెంకటేష్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కరణం వెంకటేష్ గురువారం స్వయంగా వచ్చి గుడి పరిసరాలను పరిశీలించిన అనంతరం రోడ్డును వేయాలని అధికారులకు సూచించారు. హనుమాన్ జయంతి లోగా ఈ రోడ్డును పూర్తి చేస్తామని కమిటీ సభ్యులకు ఆయన హామీ ఇచ్చాడు. డాక్టర్ తాడివలస దేవరాజు, నంగు రాజశేఖర్ రెడ్డి, ఆంజనేయస్వామి కమిటీ సభ్యులు దండే మురలారెడ్డి, నక్కల శ్రీనివాస్, వీసా రత్తయ్య, వీసా శంకర్ వడ్లమూడి కోటేశ్వరరావు,బూదాటి వెంకటేశ్వర్లు మరియు ప్రసాద్ నగరం యువత పాల్గొన్నారు

ఎరుకుల సంక్షేమం కృషి చేయాలి

విశాలాంధ్ర-వేమూరు: రాష్ట్ర , జిల్లాలలో నివసిస్తున్న ఏకలవ్య (ఎరుకల) జీవన ప్రమాణాలు పెంచడానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని శివన్నారాయణ అన్నారు. గురువారం వేమూరు ఏకలవ్య (ఎరుకల) కాలనీలో ఆత్మీయ సమావేశం జరిగినది. ఈ సందర్భంగా శివన్నారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలో ఏకలవ్య ల పరిస్థితి అట్టడుగుకు దిగజారిన దని, ఈ పరిస్థితుల నుండి గట్టెక్కేందుకు మార్గాలను అన్వేషించాల్సిన దిగా ఆయన ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దేవరకొండ శంకర రావు మాట్లాడుతూ రాష్ట్రంలో ఏకలవ్యుల పరిస్థితి దారుణంగా ఉందని దీనిని గట్టెక్కించేందుకు ప్రభుత్వం వారి జీవన ప్రమాణాలను మెరుగు పరచవలసిన అవసరం ఎంతైనా ఉందని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ఈరోజు జరిగిన కార్యక్రమంలో మండల మరియు గ్రామ నూతన కమిటీల ఎన్నిక జరిగింది. నూతనంగా ఎంపికైన వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు పాలపర్తి రామ్ ప్రసాద్, గరిక శ్రీనివాసరావు, దేవర జగదీష్, దేవరకొండ గజేంద్ర, సాల వంశి, గాంధీ తదితరులు పాల్గొన్నారు.

పలు కార్యక్రమాలకు ఎమ్మెల్యే గొట్టిపాటి

విశాలాంధ్ర-బల్లికురవ: గ్రామాలలో పలు కార్యక్రమాలకు గురువారం అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ హాజరయ్యారు. కొత్తూరు గ్రామానికి చెందిన పోలినేని ప్రసాదరావు, కుమారి దంపతుల కుమార్తె నాగ శ్రావణి వివాహ మహోత్సవానికి హాజరై నూతన వధువును ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు.ఎస్ ఎల్ గుడిపాడు గ్రామానికి చెందిన ఏడుకొండలు,తిరుపతమ్మ దంపతుల కుమారుడు పెద్ద గోపి వివాహనికి హాజరై నూతన వరుడుని ఆశీర్వదించాడు.అనంతరం కొమ్మినేనివారిపాలెం గ్రామంలో కొమ్మినేని రమేష్ బాబు నూతన గృహప్రవేశ వేడుకకు హాజరయ్యారు.అదే గ్రామానికి చెందిన వంకాయల రామాంజనేయులు ఇటీవల కంటి శస్త్రచికిత్స చేయించుకోగా వారిని పరామర్శించి,అదే గ్రామానికి చెందిన యడవల్లి రమణ కుమారుడు గోపి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అదేవిధంగా యడవల్లి లక్ష్మయ్య ఇటీవల కాలంచేయగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈయన వెంట మండల టీడీపీ అధ్యక్షుడు కే ఇజ్రాయిల్, ఎల్లలచెరువు హనుమంతురావు, ఆంజనేయులు, మంగారావు ఉన్నారు.

తుమ్మల శ్రీధర్‌కు ఆనందబాబు పరామర్శ

విశాలాంధ్ర-వేమూరు: వేమూరు మండలం లోని వేమూరు, పెరవలి పాలెం గ్రామాలలో అనారోగ్యానికి గురి అయిన టిడిపి కార్యకర్తలను మాజీ మంత్రి టిడిపి పోలిట్బ్యూరో సభ్యులు నక్క ఆనంద బాబు గురు వారం గృహాలను సందర్శించి పరామర్శించారు. వేమూరు లో టిడిపి నాయకుడు తుమ్మల శ్రీధర్ ఇటీవల ప్రమాదానికి గురై గాయాల అవ్వగా శ్రీధర్ ను ఆనందబాబు పరామర్శించి ఆరోగ్య విషయాలు తెలుసుకున్నారు. అదేవిధంగా పెరవలి పాలెం గ్రామంలో విష్ణు మొలకల వీరయ్యను పరామర్శించారు. చావలి గ్రామంలో తెలుగుదేశం పార్టీ నాయకులు అయినంపూడి నాగేశ్వరరావు కుమారుడి వివాహ రిసెప్షన్ వేడుకలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. పెరవలి గ్రామం లో తెలుగు యువత అధ్యక్షులు కేసని శివకృష్ణ తాతగారు కేసని రామయ్య ఇటీవల మృతి చెందగా వారి కుటుంబాన్ని సందర్శించి పరామర్శించి చిత్రపటానికి పూలమాలలు వేసి పరామర్శించారు. ఆయా కార్యక్రమాల్లో వ్యవసాయ మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ జొన్నలగడ్డ విజయబాబు, మాజీ ఎంపీపీ దండే సుబ్బారావు, దాది లక్ష్మణరావు, ఇక్కుర్తి నాగయ్య, శేషగిరిరావు, నరసింహారావు, అమెరినేని రవి, తులం రమేష్ తదితరులు ఆయన వెంట ఉన్నారు.

రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలి

విశాలాంధ్ర-పిట్టలవానిపాలెం: ఖరీఫ్ సాగుకు రైతులు వ్యవసాయ యాజమాన్య పద్ధతులు పాటించాలని ఏరువాక కేంద్రం బాపట్ల కోఆర్డినేటర్ డాక్టర్ ఎం.సీ ఓబయ్య సూచించారు. గురువారం మండలం లోని మంతెనవారిపాలెం ఆర్బికే నందు జిల్లా వనరుల కేంద్రం ఆధ్వర్యంలో రైతులకు ఖరీఫ్ సాగుకు సమాయత్తంపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో లోతు దుక్కులు, మట్టి నమూనా పరీక్షలు రైతులు చేసుకునే విధంగా, ఖరీఫ్ లో వాడవలసిన విత్తనాల రకములు వాటి ఆవశ్యకత మరియు విత్తన శుద్ధి గురించి రైతులకు వివరించారు.జిల్లా వనరుల కేంద్రం డిడిఏ ఎం.విజయనిర్మల మాట్లాడుతూ పచ్చిరొట్ట ఎరువులు వాటి ఆవశ్యకత, పిఎం కిసాన్ ఈ కేవైసీ, సమస్యాత్మక భూములు వాటి యాజమాన్య పద్ధతులు, వ్యవసాయంలో యాంత్రీకరణ ప్రాముఖ్యత గురించి, ఈ క్రాప్ బుకింగ్ ప్రాధాన్యత గురించి వివరించారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి, సి.హెచ్ సుదర్శన్ రావు, గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

మేరుగ నాగార్జున క్షమాపణ చెప్పాలి

విశాలాంధ్ర-చీరాల: బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం బహుజనులందరిని ఏకం చేసి మనువాదుల చేతిలో ఉన్న అధికారాన్ని గుంజుకొని ఒక సామాన్య మహిళని నాలుగుసార్లు ముఖ్యమంత్రిగా చేసి అంబేద్కర్ కి నిజమైన వారసుడిగా పేరు ఉన్న కాన్షిరం గురించి తక్కువ చేసి మాట్లాడిన మెరుగు నాగార్జున కాన్షిరామ్ కి ప్రత్యక్షంగా ఆయన విగ్రహం దగ్గరికి వెళ్లి క్షమాపణ చెప్పాలని చీరాల బిఎస్పీ ఇంచార్జి రవి అన్నారు. చీరాల బహుజన సమాజ్ పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో బిఎస్పీ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిఎస్పీ నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మెరుగు నాగార్జున బహుజన్ సమాజ్ పార్టీ వ్యవస్థాపకులు కాన్షిరాం గురించి తక్కువ చేసి మాట్లాడటం జగన్మోహన్ రెడ్డి గురించి భజన చేయడం సంక్షేమ పథకాలు పేరు చెప్పి గొప్ప నాయకుడని పొగడడం పదవి కాంక్షతో చేయడం సర్వసాదరణమని కానీ మహానియులను తక్కువ చేసి మాట్లాడడం అవివేకమని అన్నారు.ఈ దేశంలో కాన్షిరం గురించి తెలియని వాళ్ళు లేరని మెరుగు నాగార్జున కాన్షిరం గురించి తెలుసుకొని మాట్లాడాలని అన్నారు. బహుజన రాజ్యాధికారం కోసం పాటుపడి అధికారం సాధించిన కాన్షిరం ఎక్కడ దళితుల పథకాలు ఎత్తేస్తున్న జగన్ ఎక్కడ ఒకసారి ఆలోచించుకోవాలని అన్నారు.

సాంఘిక సంక్షేమ శాఖ మంత్రిగా ఉన్న మెరుగ నాగార్జున తన ఆధ్వర్యంలో దళితుల సంక్షేమ పథకాలు మొత్తం ఎత్తేసి మహానియులను ముఖ్యమంత్రితో పోల్చి పొగడడం సిగ్గుచేటని,ఇప్పటికైనా కాన్షిరం విగ్రహ కాళ్ళు పట్టుకొని క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ చీరాల నియోజకవర్గ అధ్యక్షులు గొర్రెపాటి రవికుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ బాజీ షరీఫ్, నియకవర్గ నాయకులు వంశీ, కుంచల పుల్లయ్య, సుధాకర్, జోషి తదితరులు పాల్గొన్నారు.

బాపట్ల టౌన్: బహుజన సమాజ పార్టీ వ్యవస్థాపకులు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ నిజమైన వారసుడు కాన్సిరాం పై రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగర్జున చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదంగా మారాయి. గురువారం బిఆర్ అంబేద్కర్ భవన్ నందు బహుజన్ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షులు కాగిత కోటేశ్వరావు నేతృత్వంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. దాసరి లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

విశాలాంధ్ర-పిట్టలవానిపాలెం: సచివాలయ సిబ్బంది ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఎంపీడీవో పద్మజ సూచించారు. గురువారం మండలంలోని చందోలు గ్రామ సచివాలయంను ఎంపీడీవో సందర్శించి సిబ్బంది హాజరు పట్టి రిజిస్టర్, రికార్డులను పరిశీలించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాల క్యాలెండర్ వివరాలు, వివిధ పథకాలకు సంబంధించిన అర్హులైన లబ్ధిదారుల జాబితాలను సచివాలయంలో తప్పనిసరిగా ప్రదర్శించాలన్నారు.ప్రజల నుంచి స్వీకరించిన దరఖాస్తులను నిర్ణీత గడువులోపు పరిష్కరించాలని చెప్పారు.ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులకు అందుతుందా లేదా అనేది పరిశీలన చేసి అర్హులకు సంక్షేమ పథకాలు అందే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.సచివాలయ సిబ్బంది ప్రతి రోజు సమయపాలన పాటించి ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రభుత్వ సేవలందించాలని తెలియజేశారు.ఎంపీడీవో వెంట పంచాయతీ కార్యదర్శి శేషగిరిరావు, సచివాలయం సిబ్బంది తదితరులు ఉన్నారు.

బాపట్ల డీఎస్పీ బాధ్యతలు స్వీకరణ

విశాలాంధ్ర-బాపట్ల టౌన్: బాపట్ల పోలీస్ సబ్ డివిజన్ నందు నూతన డిఎస్పీగా టీ వెంకటేశ్వర్లు బాధ్యతలు చేపట్టారు. గురువారం ఉదయం స్థానిక శ్రీ లక్ష్మి సమేత క్షీర భావన నారాయణ స్వామి దేవస్థానం నందు ప్రత్యేక పూజలు నిర్వహించి బాపట్ల పోలీస్ సబ్ డివిజన్ అధికారిగా టి వెంకటేశ్వర్లు బాధితులను చేపట్టారు. ఈ సందర్భంగా బాపట్ల జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ వ్యవస్థాపకులు వేజెండ్ల శ్రీనివాసరావు డీఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు. అదేవిధంగా బీసీ సంఘాల నాయకులు గొర్ల శ్రీనివాస్ రావు నేతృత్వంలో నూతన డిఎస్పీని దుశ్యాలవతోను పూలమాలతో సత్కరించి సాధరంగా స్వాగతం పలికారు.రిటైర్డ్ఆర్మీఉద్యోగిఆవులవెంకటేశ్వరరావు డి.ఎస్.పి కి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా డిఎస్పి మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణలో శక్తివంచన లేకుండా బాధ్యతలు నిర్వర్తిస్తానని సూచించారు.

హజ్ యాత్రికుల పై అదనపు భారం

విశాలాంధ్ర-విజయవాడ(వన్‌టౌన్): హజ్ యాత్రికుల పై రూ.83వేలు అదనపు భారం పడిందని పశ్చిమ నియోజకవర్గ టీడీపీ మైనారిటీ అధ్యక్షుడు షేక్. హబీబ్ అన్నారు. గురువారం కుద్దుస్ నగర్‌లోని టీడీపీ కార్యాలయంలో వికేకరుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైనారిటీ పక్షపాతి అంటున్న జగన్మోహన్ రెడ్డి హజ్ యాత్రకు వెళ్లే హజ్ యత్రికులకు కేంద్రం సబ్సిడీ తీసేస్తే మీరు ఆంధ్రలో ఉన్న ప్రతి ఒక్క మైనారిటీల పైన 80 వేల రూపాయల భారం పడిందన్నారు. మైనారిటీ నాయకులు గౌస్ మొహిద్దీన్ మీరు ఎం చేస్తున్నారని, దుల్హన్ పథకానికి లక్ష రూపాయలు ఇస్తానని హామీ ఇచ్చినా జగన్మోహన్ రెడ్డి ఇప్పుడు షరతులతో కూడిన పథకం అమలుచేస్తుంటే మీరు నోరు ఎందుకు తెరవట్లేదన్నారు. మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ నుండి ఇప్పటి వరకు ఏ ఒక్క ముస్లిం మైనారిటీకి కూడా ఒక్క రూపాయి అందలేదని తెలిపారు.. ఈ కార్యకమంలో పార్లమెంట్ మైనారిటీ సెల్ కార్యనిర్వహణ కార్యదర్శి షేక్ రియాజ్, నియోజకవర్గం ఉపాధ్యక్షులు ఎండి అహకలక్, నియోజకవర్గ తెలుగు యువత ఉపాధ్యక్షులు సయ్యద్ ఫయాజ్ హుస్సేన్, 53వ డివిజన్ తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు షేక్ తారిక్ అజీజ్, కార్యనిర్వహణ కార్యదర్శి షేక్ బడేషా, షేక్ ఫక్రుద్దీన్ పాల్గొన్నారు.

దివ్యాంగుల పథకాలపై నిర్లక్ష్యం తగదు

విశాలాంధ్ర-వినుకొండ: 2016 వికలాంగుల హక్కుల చట్టం ఏడాది ఏప్రిల్ 19 నుండి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిందని విభిన్న ప్రతిభావంతుల రాష్ట్ర విభాగ అధ్యక్షులు బందెల కిరణ్ రాజ్ తెలిపారు. బుధవారం స్థానిక ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ లో ఆయన విలేకరులతో మాట్లాడారు. వికలాంగుల హక్కుల చట్టం కోసం పోరాటం చేస్తూనే ఉన్నామని, కేంద్ర ప్రభుత్వం ఈ చట్టాన్ని తీసుకురాగా సీఎం వైయస్ జగన్మోహన్ రెడ్డి 51 గైడ్లైన్స్ తో చట్టాన్ని అమలు చేశారని దీనిలో భాగంగా హక్కుల భద్రత- ఆత్మీయ అభినందన సభలు జరుగుతున్నాయని తెలిపారు. ఈ చట్టం అమలు వలన దివ్యాంగులకు భద్రత పెరుగుతుందని, దివ్యాంగులను చులకనగా చూసిన, మానసికంగా శారీరకంగా అవహేళన చేసిన ఈ చట్టం ద్వారా ఐదు సంవత్సరాలు జైలు శిక్ష పడుతుందని వివరించారు. 19వ తేదీ నుండి రాష్ట్రవ్యాప్తంగా చట్టంపై అవగాహన కార్యక్రమాలు జరుగుతున్నా యని జిల్లా వ్యాప్తంగా ఐదుగురితో కూడిన కమిటీ ఏర్పాటు చేసి చైర్మన్గా కలెక్టర్ ను ప్రభుత్వం నియమించడం జరిగిందన్నారు. విభిన్న ప్రతిభావంతుల విభాగ మూడు జిల్లాల కోఆర్డినేటర్ కొమ్మిరెడ్డి శివారెడ్డి మాట్లాడుతూ వికలాంగులకు రక్షణ కల్పించేందుకు సీఎం జగన్మోహన్ రెడ్డి హక్కుల చట్టం అమలు చేయడం వికలాంగుల ఆత్మగౌరవానికి నిదర్శనం అన్నారు. వికలాంగులను సమీకరణ చేసి ప్రభుత్వ సంక్షేమ ఫలాలను చేరువ చేస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నామని తెలిపారు. జిల్లాలో వికలాంగులు ఎక్కువగా ఉన్న ప్రాంతం వినుకొండని వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించాలని కోరారు. సమావేశంలో దివ్యాంగుల సంఘం నాయకులు శ్రీనివాసులు, ప్రభాకరు, వైసిపి నాయకులు దాట్ల అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం జగన్మోహన్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.

ఆటోవాలాలతో ఇక్కట్లు

విశాలాంధ్ర-రాజుపాలెం : రాజుపాలెం మండలంలోని ఆయా గ్రామాల నుంచి ప్రతి రోజు ఉదయాన్నే పనికి వెళ్ళే పత్తి, మిరప కూలీలు అవసరాల రీత్యా ఆటోలను ఆశ్రయిస్తున్నారు. ఆటో అంటేనే ప్రమాదకర ప్రయాణం అనేంతగా పరిస్థితి తయారైంది. సామర్థ్యానికి మించి సాగుతున్న ప్రయాణాలే ఇందుకు కారణం. సరుకు రవాణా వాహనాలలోనూ కుక్కేసి మరీ కూలీలను తరలిస్తున్నారు. నలుగురెక్కాల్సిన ఆటోలు 40 మందికి పైగా కూలీలను ఎక్కిస్తూ తరలిస్తున్నారు. పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తున్న వాహనాలు కట్టడి చేయడంలో అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. కేవలం పత్రాల తనిఖీ, అపరాధ రుసుము వేయడంతోనే సరిపెట్టుకుంటున్నారన్న విమర్శలున్నాయి. అధికారులు రోడ్డు భద్రతపై నియమ నిబంధనలు ప్రతి ఒక్కరూ పాటించినప్పుడే ప్రమాదాలు చోటు చేసుకోకుండా ఉంటాయని, ఆటోవాలా అవగాహన సదస్సులు నిర్వహించినప్పటికీ మీసమెత్తు ఫలితం లేదని బలంగా ఆరోపణలు వినిపిస్తున్నాయి.